ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పేదల బియ్యం.. తమ్ముళ్లు తినేస్తున్నారు..



రేషన్ బియ్యం నిల్వలు (పాత చిత్రం)

ఉమ్మడి జిల్లాలో రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

- అక్రమార్కులకు అధికారం అండ
- అక్కడ నెలకు రూ. 28 లక్షలివ్వాలంట
- అధికారుల తీరుపైనా విమర్శలు
- సమాచారం ఇచ్చినా స్పందించని వైనం
- ఉమ్మడి జిల్లా బియ్యం డాన్ ప్రసాద్
- టోకుగా కేజీ రూ. 28కి కొనుగోలు

ఐదేళ్లు వైసీపీ నేతల కనుసన్నల్లో రేషన్ బియ్యం దందా సాగింది. అధికారం మారింది.. బియ్యం వ్యాపారులు మారారు. అంతే అక్రమాలు మాత్రం అప్పటిలాగానే కొనసాగుతుండటం గమనార్హం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు బియ్యం చీకటి వ్యాపారం నిర్వహించడం కొన్ని ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. అధికార పార్టీ నేతలు కొందరు బియ్యం అక్రమ వ్యాపారాన్ని వారి అదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. వైసీపీ పాలనలో పెద్ద ఎత్తున బియ్యం బ్లాక్ మార్కెట్ జరిగింది. అప్పట్లో బియ్యం అక్రమ నిల్వలను ప్రతిపక్ష నేతలు పట్టించారు. బియ్యం అక్రమ వ్యాపారంపై పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. అధికారం మారగానే బియ్యం అక్రమ వ్యాపారం నిరోధిస్తారని ప్రజలు భావించారు. అప్పటి లాగానే బియ్యం నల్లబజారుకు తరలిపోతున్నా నాడు ప్రతిపక్షంలో విమర్శలు చేసిన నేతలు నోరు మెదపకపోవడంతో ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. మాటలే చేతల్లో ఉండదని నేతలను ప్రజలు విమర్శిస్తున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పౌరసరఫరాల శాఖ మంత్రి ఇలాకాలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రతి నెలా వేలాది క్వింటాళ్ళ రేషన్ బియ్యం నల్ల బజారుకు తరలిపోతున్నాయి. రేషన్ సరఫరా చేసే ఎం యూడీ వాహనం వద్దే బహిరంగంగా కొనుగోలు చేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని ఒక పట్టు పాలిష్ వేసి,గోతాలు మార్చి జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. నెలకు రూ కోట్లల్లో ముడుపులు చేతులు మారుతున్నాయి. అధికార పార్టీ నేతల అండదండలతోనే బియ్యం అక్రమ వ్యాపారం విరాజిల్లుతోంది. కార్డుదారులకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం నిల్వల్లో సగం వరకు బ్లాక్ మార్కెట్ కు తరలిపోతున్నట్టు అంచనా. ఇదంతా బహిరంగానే జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోరు. కొందరు అధికారులకు.. కొందరు అధికార పార్టీ నేతలకు నెలవారీ మామూళ్లు ఇస్తున్నారనేది బహిరంగ రహస్యమే. రేషన్ పంపిణీపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నెలవారీ తనిఖీలు నిర్వహించడాన్ని కూడా వారు విస్మరించారు.

గుజరాత్‌కు తరలిపోతున్న బియ్యం నిల్వలు

మండల, నియోజకవర్గ స్థాయి వ్యాపారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యం నిల్వలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. గతంలో కాకినాడ పోర్టుకు బియ్యం నిల్వలు తరలించేవారు. ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ కాకి నాడ పోర్టులో తనిఖీలు నిర్వహించి వేలాది క్విం టాళ్ల బియ్యం అక్రమ నిల్వలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో బియ్యం బ్లాక్ మార్కెట్ రూటు మారింది. జిల్లాలో సేకరించిన బియ్యం నిల్వలను ప్రస్తుతం గుజరాత్‌కు తరలిస్తున్నట్టు అక్రమార్కులు బహిరంగానే చెబుతున్నారు.

అధికారులపై అధికార పార్టీ ఒత్తిళ్లు

బియ్యం అక్రమ వ్యాపారం, బియ్యం రీసైక్లింగ్ జరిగే మిల్లులు వీటి చిరునామాలతో సహా సమాచారం ఉన్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడరు. కొందరు అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నా కొందరు అధికారులు బియ్యం బ్లాక్ మార్కెట్‌పై స్పందించి తనిఖీలు నిర్వహించినా చర్యలు తీసుకొనే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు. వీరిపై అధికార పార్టీ ఒత్తిడి ఉండటం జగమెరిగిన సత్యమే. బ్లాక్ మార్కెట్ చేస్తోంది అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కావడంతో చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మిన్నకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల పల్నాడు జిల్లాలోని ఒక నియోజకవర్గంలో రెండు ముఠాలుగా నేతలు విడిపోయి బియ్యం వ్యాపారం నిర్వహించారు. ఒక ముఠాకు సంబంధించి బియ్యం నిల్వ చేసిన మిల్లుపై మరో ముఠా విజిలెన్స్ అధికారుల చేత దాడులు చేయించింది. అయినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తనిఖీలకు వచ్చిన అధికారులు మిల్లులో బియ్యం నిల్వలు లేవని వెల్లడించడం గమనార్హం.

ప్రతి నెలా రూ. 22 కోట్ల వ్యాపారం

ఉమ్మడి జిల్లాలో 14,91,277 తెల్ల కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 2,04,850 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నారు. వీటిలో 40 నుంచి 50 శాతం బియ్యం నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు ఒక అంచనాగా ఉంది. అంటే దాదాపు 90 వేల నుంచి లక్షల క్వింటాళ్ల వరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్లు అక్రమార్కులు చెబుతున్న లెక్కలు తెలియజేస్తున్నాయి. పల్నాడు జిల్లాలోని ఒక నియోజకవర్గానికి నెలకు 13,971 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతోంది. అయితే ఒక ముఠా 250 టన్నులు, మరో ముఠా సుమారు 150 టన్నులు బియ్యం డీలర్ల నుంచి సేకరించి బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్టు ప్రచారం. ప్రభుత్వం కార్డు దారులకు సరఫరా చేసిన నిల్వల్లో దాదాపు 40 శాతం బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్టు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 8 వేల టన్నుల వరకు బియ్యం నిల్వలు జిల్లా సరిహద్దు దాటి పోతున్నాయనేది ఒక అంచనాగా ఉంది. టోకు వ్యాపారి కిలో రూ. 28 బియ్యం కొనుగోలు చేస్తుండగా దీని ప్రకారం దాదాపు ప్రతి నెలా రూ 22 కోట్లకు బియ్యం అక్రమ వ్యాపారం జరగుతున్నట్టు అంచనా.

బ్లాక్ మార్కెట్ కట్టడి చేసేనా?

ఉమ్మడి జిల్లాలో వైసీపీ హయాంలో పెద్దఎత్తున బియ్యం బ్లాక్ జరిగింది. అదే వరవడిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అక్రమార్కులు కొనసాగిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం పేదల బియ్యం బ్లాక్ మార్కెట్‌ను పూర్తిగా నిరోధిస్తుందని ప్రజలు భావించారు. రెండు నెలలు గడిచినా బియ్యం బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాకు చెందిన నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారు. అయన కాకినాడ పోర్టులో తనిఖీలు నిర్వహించి వేలాది టన్నుల బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఇదే తరహాలో ఉమ్మడి జిల్లాలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నరసరావుపేటలో 50 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

నరసరావుపేట లో 50 బస్తాల రేషన్ బియ్యం నిల్వలను రూరల్ పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం ఇక్కడి వ్యాపారులకు కాకుండా ప్రకాశం జిల్లాకు తరలిస్తున్నారన్న సమాచారంతో ఇక్కడి కొందరు ఓపార్టీ కార్యకర్తలు వినుకొండ రోడ్డులో రాత్రి 10 గంటల సమయంలో కాపుకాసి బియ్యం తరలిస్తున్న ఆటోను అడ్డుకున్నారు. ఈ మేరకు సదరు వ్యక్తులు రూరల్ పోలీసులకు సమా చారం ఇచ్చారు. రూరల్ పోలీ సులు బియ్యం నిల్వ ఉన్న ఆటోను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నరసరావుపేటలోని వినుకొండ రోడ్డులో బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా పోలీసులకు పట్టించిన బియ్యం ఉన్న వాహనం

పల్నాడులో రెండు ముఠాలు..

పల్నాడు జిల్లాలోని ఒక నియోజక వర్గంలో అధికార పార్టీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి బియ్యం డీలర్ల నుంచి కొనుగోలు చేశారు. ఒక ముఠా కిలో రూ 13, మరో ముఠా కిలో రూ 15 నుంచి 16కు కొనుగోలు చేశారని నియోజకవర్గం మొత్తం కోడైకూసింది. ఇక్కడ ఒక ముఠాలో దాదాపు 10 మంది సభ్యులు ఉండగా ఒక్కొక్క వ్యక్తి రూ 5 నుంచి 7 లక్షలు పెట్టుబడి వ్యయంగా ఒక నేత వద్ద ఉంచినట్టు తెలిసింది.

బియ్యం బ్లాక్ మార్కెట్ ఇలా..

కార్డు దారుల నుంచి డీలర్లు కిలో రూ 8 నుంచి రూ 10 వరకు కొనుగోలు చేస్తున్నారు. వీరి వద్ద నుంచి మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కులు డీలర్ల వద్ద కిలో రూ 13 నుంచి రూ 16 వరకు కొనుగోలు చేస్తేన్నారు. మండలాల వారీగా స్టాక్ పాయింట్‌లు ఏర్పాటు చేసుకొని రాత్రి వేళ్లలో అక్రమార్కులు ఆటోలు వంటి చిన్న వాహనాల్లో డీలర్లు నుంచి బియ్యం సేకరిస్తున్నారు. ఇలా నిల్వలను స్టాక్ పాయింట్‌కు తరలిస్తున్నారు. కొన్ని చోట్ల మిల్లులను లీజుకు తీసుకొని సేకరించిన బియ్యంకు ఒక పట్టు పాలీష్ వేసి గోతాలు మారుస్తున్నారు. 25, 50 కేజీల ప్యాకింగ్ చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయి వ్యాపారుల నుంచి టోకు వ్యాపారి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. టోకు వ్యాపారి కిలో బియ్యం రూ 28 కొనుగోలు చేస్తున్నాడు. డీలర్ నుంచి టోకు వ్యాపారి వరకు బియ్యం నెలవారీగా కొనుగోళ్లు జరగుతున్నాయి. అక్రమార్కులు పోటీ పడ్డ చోట డీలర్లకు రేటు ఎక్కువగా లభిస్తున్నట్టు తెలిసింది.

బియ్యం డాన్.. గుంటూరు ప్రసాద్ ?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టోకుగా బియ్యం కొనే వ్యక్తి గుంటూరుకు చెందిన ప్రసాద్‌గా తెలుస్తోంది. ఇతనికి అక్రమార్కులు బియ్యం డాన్... గుంటూరు ప్రసాద్‌గా పిలుచుకుంటారు. ఈ వ్యక్తి నియోజకవర్గాల వారీగా అక్రమార్కుల వద్ద నుంచి బియ్యం కిలోకు రూ. 28 చెల్లించి కొనుగోలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఇతని కింద చాలా నియోజకవర్గాలు ఉన్నట్టు తెలిసింది. సత్తెనపల్లి మండలం కొమెరపూడి, పేరేచర్లలో సదరు వ్యాపారి స్టాక్ పాయింట్‌లు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా సేకరించిన బియ్యం నిల్వలను ఆయా స్టాక్ పాయిం ట్‌ల నుంచి గుజ రాత్‌కు తరలిస్తున్నట్లు ప్రచారం. వైసీపీ పాలనలోనూ ఈ ప్రసాద్ ఐదేళ్లు బ్లాక్ మార్కెట్ నిర్వహించాడని, అతనే ఇప్పుడు కూడా కొనసాగుతున్నట్టు చెబుతున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా బియ్యం బ్లాక్ మార్కెట్ చేసిన వ్యాపారులనే కొందరు నేతలు కొనసాగిస్తుండటాన్ని అధికార పార్టీలో కొందరు నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. మండలాలు.. నియోజకవర్గాల వారీగా బియ్యం బ్లాక్ మార్కెట్ చేసుకొనే అవకాశాన్ని కొందరు వ్యాపారులకు నాయకులు కట్టబెట్టినట్టు టీడీపీ వర్గాలే ప్రచారం చేస్తున్నాయి.

అక్కడ నెలకు రూ. 28 లక్షలు

బియ్యం అక్రమ వ్యాపారంలో ఉమ్మడి జిల్లాలో కొన్ని నియోజకవర్గాలు మినహా చాలా చోట్ల అధికార పార్టీ నేతలు అక్రమార్కుల నుంచి ముడుపులు తీసుకుంటు న్నట్టు పార్టీ వర్గాలే ప్రచారం చేస్తున్నాయి. ఒక చోట బియ్యం అక్రమ వ్యాపారం నిర్వహణకు నెలకు రూ. 28 లక్షలు చెల్లిస్తు న్నట్టు ప్రచారం జరుగుతోంది. మరికొన్ని చోట్ల నెలకు రూ..20 లక్షల వరకు చేతులు మారుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. కొన్ని శాఖల అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్టు తెలిసింది. ఒక శాఖలోని కొందరు అధికారులకు ఒక్కొక్క చోట నెలకు రూ 2.50 లక్షల నుంచి రూ 4 లక్షల వరకు మామూళ్లు చెల్లిస్తున్నట్టు తెలుస్తోంది. మరో శాఖకు సంబంధించి నెలకు ఒక్కొక్క చోట నెలకు రూ 50 వేల వరకు ఇస్తున్నారని ప్రచారం. దీంతో అక్రమార్కులు నిర్వహించే బియ్యం బ్లాక్ మార్కెట్ నిరాటంకంగా సాగుతుందని చెబుతున్నారు.

పరిశ్రమలలో ముందస్తు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ జె.వెంకటమురళి



బాపట్ల,ఆగస్టు 25 : పరిశ్రమల్లో ప్రమాదాల నివారణపై అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటమురళి ఆదేశించారు. పరిశ్రమల నిర్వహణ, ప్రమాదాల నియంత్రణపై అనుబంధ శాఖల అధికారులతో ఆదివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. పరిశ్రమలలో మానవ వనరుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విపత్తులు, ప్రమాదాలు జరిగిన తర్వాత సహాయ చర్యలు కంటే ముందస్తు సంరక్షణ చర్యలు ముఖ్యమన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెడ్, ఆరంజ్ కేటగిరిలలో ఉన్న పరిశ్రమలను అధికారులు తనిఖీలు చేయాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణం చట్టప్రకారం ఆయా పరిశ్రమలు నిర్వహిస్తున్నారా అనే అంశంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సూచించిన 19 ప్రధాన పరిశ్రమలలో అధికారులు బృందాలుగా వెళ్ళి పరిశీలించాలని చెప్పారు. నిబంధనల వర్తింపుపై నిశిత పరిశీలన ఉండాలన్నారు. ఈటీసీబి నిబంధనల అమలు తీరుపై నివేదిక ఇవ్వాలన్నారు.

పరిశ్రమలలో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికుల గణన చేపట్టాలని ఆదేశించారు. పరిశ్రమలలో మానవ వనరుల సంరక్షణ, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్మికులకు వేతనాల చెల్లింపులు, బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపుపై తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలన్నా రు. గ్రానైట్ పరిశ్రమలు, పాలిషింగ్ యూనిట్‌లలో కార్మిక శాఖాధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. పరిశ్రమలు నుంచి ప్రమాదకర ఉద్గారాలు వెలువడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బాపట్ల జిల్లాలో పరిశ్రమల ద్వారా ఏ వ్యక్తికి ఎలాంటి హాని జరగరాదని, ప్రాణనష్టం ఉండరాదని చెప్పారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచన లు చేశారు. సమావేశంలో జేసీ బి.సుబ్బారావు, జిల్లా పరిశ్రమలశాఖాధికారి వై.రామకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అద్దంకి పట్టణంలోని బొమ్మనంపాడు రోడ్డులో జగనన్న కాలనీ వ్యూ



అమ్మకానికి.. జగనన్న ఇళ్లు

- వైసీపీ పాలకుల బలవంతంతో నిర్మాణం
- రూ.10 నుంచి రూ.15 లక్షల ఖర్చు
- ప్రభుత్వం ఇచ్చింది రూ.1.80లక్షలు
- నిండా మునిగిపోయామని లబ్ధిదారుల ఆవేదన

అద్దంకి, ఆగస్టు 25 : వైసీపీ గొప్పగా చెప్పుకున్న నవరత్నాలలో ఒకటైన జగనన్న ఇళ్ల నిర్మాణం పేదలపాలిట శాపంగా మారింది. కాలనీలలో ఇళ్ల నిర్మాణం చేసుకున్న కొందరు లబ్ధిదారులు గత వైసీపీ ప్రభుత్వం తీరుతో అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అందులో నుంచి బయట పడేందుకు కట్టుకున్న ఇంటిని అమ్ముకుంటున్నారు. ఇంటిని ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని చెప్పడంతో అందరూ సొంత గూడు కల నెరవేరుతుందని ఆశించారు. ఆతర్వాత వారి ఆశలపై నీళ్లు చల్లింది. లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకోవాలని సెలవిచ్చింది. కట్టుకోకపోతే పట్టాలు రద్దు చేస్తామని, పథకాలు కట్ చేస్తామంటూ లబ్ధిదారులను బెదిరించారు. చేసేది లేక కొందరు వడ్డీలకు అప్పులు తెచ్చి ఇళ్లు నిర్మించుకున్నారు. అధిక ధరలతో ఇంటి నిర్మాణానికి సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకూ ఖర్చయింది. వైసీపీ ప్రభుత్వం విడతల వారీగా ఇచ్చింది కేవలం రూ.1.80లక్షలు మాత్రమే. అది కూడా సక్రమంగా అందలేదు. అప్పులు తెచ్చి ఏడాది నుంచి రెండేళ్లు కావడంతో వాటిని తీర్చేదారి లేక, వడ్డీలు కట్టలేక కట్టుకున్న ఇళ్లనే కొందరు అమ్ముకొంటున్నారు.

అద్దంకిలో వెయ్యి ఇళ్ల నిర్మాణం

అద్దంకి పట్టణంలోని సుమారు 2 వేల మంది లబ్ధిదారులకు వేలమూరిపాడు రోడ్డు, నాగులపాడు రోడ్డు, బొమ్మనంపాడు రోడ్డులో జగనన్న కాలనీల పేరుతో లేఅవుట్లు వేసి నివేశన స్థల పట్టాలు ఇచ్చారు. సుమారు వెయ్యికి పైగా ఇళ్ల నిర్మాణం జరిగింది. మిగిలిన ఇళ్లు కూడా పూర్తి చేసినట్లు చూపించేందుకు కాంట్రాక్టర్‌ల ద్వారా పనులు ప్రారంభించారు. అయితే ఆ కాంట్రాక్టర్‌లు ఇళ్ల నిర్మాణం పేరుతో మొక్కుబడిగా పునాదులు వేసి పత్తాలేకుండా పోయారు. ఫౌండేషన్‌కు రూ.70వేల బిల్లులు రావడంతో అప్పటికి కాంట్రాక్టర్ ఒక్కో ఇంటికి ఖర్చు చేసింది రూ.40వేలులోపుగానే ఉండడంతో అడ్రస్ లేకుండా పోయినట్లు విమర్శలు వస్తున్నాయి. కాంట్రాక్టర్‌లకు లబ్ధి చేకూరగా, లబ్ధిదారులకు వేదన మిగిలింది.

ఇల్లు అమ్మినా తీరని అప్పు

జగనన్న కాలనీలో లబ్ధిదారు ఇల్లు అమ్ముకున్నా అప్పు తీరని పరిస్థితి నెలకొంది. అదనంగా మరో రూ.2లక్షల వరకూ చెల్లించాల్సి వస్తున్నదని లబ్ధిదారులు వాపోతున్నా రు. వేలమూరిపాడు రోడ్డు, నాగులపాడు రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలలో ఇళ్లు కొనేందుకు కొద్దిమంది ముందుకు వస్తున్నా అద్దంకి పట్టణానికి సుమారు 4 కి.మీ దూరంలో ఉన్న బొమ్మనంపాడు రోడ్డులోని ఆ ఇళ్లను కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని లబ్ధిదారులు చెప్తున్నారు. జగన్‌రెడ్డి హామీతో సొంతింటి కల నెరవేరుతుందన్న ఆశపడి అప్పులపాలయ్యామని లబోదిబోమంటున్నారు.



జగనన్న కాలనీలో కాంట్రాక్టర్ పౌండేషన్ లెవల్‌తో నిలిపి వేసిన ఇల్లు



బాపట్ల జిల్లా జేసీగా ప్రఖర్ జైన్



బాపట్ల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ప్రఖర్ జైన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వు లు జారీ చేసింది. ప్రస్తుతం జేసీగా విధులు నిర్వహిస్తున్న బి.సుబ్బారావు ఈ నెల31న పదవీ విరమణ చేయనున్నారు. 2021 బ్యాచ్‌కు చెందిన జైన్ తెనాలి సబ్ కలెక్టర్‌గా 2023 డిసెంబరు నుంచి ఈ నెల 19 వరకు విధులు నిర్వహించారు. వారం రోజుల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా ఆయనను పాడేరు సబ్‌కలెక్టర్‌గా నియమించడంతో పాటు ఐటీడీఏ పీవోగా అదనపు బాధ్యతలను ప్రఖర్‌జైన్‌కు ప్రభుత్వం అప్పగించింది. తాజా ఉత్తర్వుల్లో భాగంగా అయనను బాపట్ల జేసీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. జైన్‌కు జేసీగా ఇదే తొలి పోస్టింగ్ కానుంది.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

రామకృష్ణాపురం (చీరాల టౌన్), ఆగస్టు 25 : అప్పుల బాధతో చేనేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గోలి నాగమల్లేశ్వరరావు (45) చేనేత కార్మికుడు. ఇతనికి భార్య శారద, ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు హైదరాబాదులో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు స్థానికంగా ఓ ప్రైవేటు కం పెనీలో పనిచేస్తున్నాడు. వీరి ఇల్లు చిన్నది కావడంతో చిన్న కుమారుడి తో కలిసి గ్రామంలోనే కొంత దూరం లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల ముడిసరుకు ధరలు పెరిగి చేనేత పని తగ్గింది. ఈ క్రమంలోనే నాగ మల్లేశ్వరరావు ప్రైవేటు ఫైనాన్స్‌లో అప్పు చేశారు. కొంతకాలం గడిచాక నెలవారీ వాయిదాలు బకాయి పడ్డాయి. మరోవైపు పని సాగడం లేదు. ఫైనాన్స్ వాళ్ల ఒత్తిడిని తాళలేక పోయారు. కుమారులకు భారం కా కూడదని, రోజూలాగే శనివారం సాయంత్రం సొంత ఇంట్లో మగ్గం పనికి అంటూ వెళ్లి అక్కడే ఉరి వేసుకుని బలవన్మరణం చెందారు. రాత్రి పది దాటినా ఇం టికి తండ్రి రాకపోవడంతో కుమారుడు వెళ్లి చూడగా విషయం బయటపడింది. వెంటనే చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్యుల పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దిక్సూచి
DIKSUCHI

"ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పౌరస్మృతిలో మతతత్వ ఛాయలు ఉన్నాయి. మతం ఆధారంగా వివక్షను ప్రోత్సహించేలా ఉంది. దాని స్థానంలో 'లౌకిక పౌరస్మృతి'ని తీసుకురావాల్సిన అవసరం ఉంది'' అని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు కూడా అనేక సార్లు ఉమ్మడి పౌరస్మృతి గురించి చర్చించి, దీన్ని అమల్లోకి తేవాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో ఈ అంశం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా 'ఉమ్మడి పౌరస్మృతి' అంటే ఏమిటి? చట్టాలు వ్యక్తిగతంగా ఉండాలా? మత పరంగా ఉండాలా? లేదా దేశ పౌరులందరికీ ఒకే చట్టం వర్తింప జేయాలా? అనే అంశాలను సమగ్రంగా చర్చిద్దాం.

ఉమ్మడి పౌరస్మృతి
'ఒకే దేశం - ఒకే చట్టం'

ఇండియన్ పాలిటీ

దొంగతనం, అత్యాచారం, హత్య... ఈ నేరాలు ఎవరు చేసినా వారి మతం, కులాలతో సంబంధం లేకుండా కోర్టులు శిక్షలు విధిస్తాయి. కానీ... పెళ్లి, విడాకులు, భరణం, దత్తత, వారసత్వం, మహిళలకు ఆస్తిహక్కు వంటి విషయాల్లో మాత్రం దేశ ప్రజలందరికీ ఒకే చట్టం వర్తించదు. హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు వారి వారి పర్సనల్ లాస్(మతం ఆధారంగా కల్పించిన వ్యక్తిగత చట్టాలు) ఆధారంగా శిక్షలు ఉంటాయి. అలాగే రాష్ట్రాలవారీగానూ అనేక చట్టాలు ఉన్నాయి. అలా కాకుండా పెళ్లి, విడాకులు, దత్తత, వారసత్వం, ఆస్తిహక్కు వంటి వాటి విషయాల్లో రాష్ట్రాలకు, మతాలకు అతీతంగా అందరికీ ఒకే చట్టం ఉండాలనే భావనకు ప్రతిరూపమే 'ఉమ్మడి పౌరస్మృతి'.

ఇతర దేశాల్లో ఉమ్మడి పౌరస్మృతి

- అమెరికాలో భిన్న మతాలను అవలంబించేవారు, భిన్న జాతులకు చెందిన ప్రజలు నివశిస్తున్నారు. అలాగని అక్కడ విడివిడిగా ప్రత్యేక చట్టాలు లేవు.
- ఫ్రాన్స్, జర్మనీ, చైనాలో కూడా మతాల ప్రాతిపదికన చట్టాలు లేవు.
- ఈజిప్ట్, మొరాకొ, తుర్కియో వంటి ముస్లిం దేశాల్లోనూ అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక చట్టాలు లేవు.

ముందు దేశపౌరుడు, ఆ తరవాతే మతం

ఓ మైనర్ ముస్లిం బాలిక వివాహానికి సంబంధించి కేరళ హైకోర్టు ఇటీవల ఒక తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల లోపు వివాహం చేసుకునే హక్కు ఉందని బాలిక తండ్రి చేసిన వాదనను తిరస్కరించింది. 'ఏ వ్యక్తి అయినా ముందు దేశ పౌరుడని, ఆ తరవాతే ఆయా మతాల సభ్యులని పేర్కొంటూ..... హిందువైనా, ముస్లిమైనా, క్రిస్టియన్ అయినా.... అందరికీ బాల్య వివాహ నిషేధచట్టం(2006) వర్తిస్తుందని కేరళ హైకోర్టు 28 జూలై 2024న స్పష్టం చేసింది.


పర్సనల్ లాస్

మన దేశంలో పౌరుల వ్యక్తిగత అంశాలైన పెళ్లి, ఆస్తులు, వారసత్వం, దత్తత వంటి వాటికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను మతం ఆధారంగా రూపొందించారు. అవి... హిందూ వివాహ చట్టం(1955), హిందూ వారసత్వ చట్టం(1956), హిందూ దత్తత నిర్వహణ చట్టం(1956); భారతీయ క్రైస్తవ వివాహ చట్టం(1957), భారత విడాకుల చట్టం(1969); పార్శీ వివాహ, విడాకుల చట్టం(1936), ముస్లిం పర్సనల్ లా అప్లికేషన్ యాక్ట్(1937), ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ చట్టాలు, కశ్మీర్ సంప్రదాయ చట్టాలు మొదలైనవి.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



ఎలిజిబిలిటీ టెస్ట్

రీజనింగ్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్‌కి సంబంధించిన ఎలిజిబిలిటీ టెస్ట్ అనే ఈ టాపిక్‌కి చాలా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా ఎస్.ఐ., బ్యాంకింగ్ మొదలైన పరీక్షల్లో ఈ విభాగం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ముందుగా ఏదైనా ఉద్యోగానికి, కళాశాలలో ప్రవేశానికి, బ్యాంకులో లోన్ లభించడానికి మొదలైన వివిధ అంశాలకు అర్హతలు నిర్ణయిస్తారు. తదుపరి వివిధ వ్యక్తుల వ్యక్తిగత సమాచారం (పర్సనల్ డేటా) తెలుసుకుంటారు. ఆ సమాచారంలోని అంశాలు ప్రశ్నలో ఇచ్చిన అర్హతలకు సరిపోయిందా లేదా పరిశీలించి దానిని బట్టి ఐచ్ఛికాలుగా ఎ, బి, సి, డి, ఇ లలో సరైన దానిని సమాధానంగా గుర్తించాలి. గ్రూప్ 1 కోచింగ్‌ను అందించే ఒక ప్రముఖ శిక్షణసంస్థలో ఉచిత కోచింగ్ ప్రవేశానికి విద్యార్థికి తప్పనిసరిగా కింది అర్హతలు ఉండాలి.

1. విద్యార్థి కచ్చితంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో తప్పనిసరిగా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
2. విద్యార్థి వయసు 2023 మే 25 నాటికి 22 సంవత్సరాలకు తగ్గకూడదు, 30 సం॥లకు మించకూడదు.
3. విద్యార్థి సంరక్షకుల వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదు.
4. విద్యార్థి కోచింగ్ శిక్షణాకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు లేదా పరీక్ష తేదీ వరకు (ఏదీ ముందు జరిగితే అలా) తప్పనిసరిగా కోచింగ్ నిర్వాహకులు తెలిపిన విధంగా ప్రిపరేషన్ కొనసాగిస్తూ శిక్షణసంస్థలోనే ఉండాలి.
5. ఆ సంస్థ ద్వారా ఉచిత కోచింగ్ పొంది ఉద్యోగానికి ఎన్నికైతే తప్పనిసరిగా ఆ సంస్థకు 50,000 రూపాయలను విరాళంగా ఇవ్వడానికి సుముఖత తెలుపుతూ అంగీకారపత్రంపై సంతకం చేయాలి.
6. పై వాటిలో ఒకటో అర్హతకు బదులుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 75% మార్కులు ఉన్నట్లయితే ఆ విద్యార్థి విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
7. పై వాటిలో అయిదో పాయింట్‌లో సూచించిన విధంగా అంగీకార పత్రానికి బదులు శిక్షణా కాలం జరుగుతున్న సమయంలోనే రూ.15,000/- చెల్లించడానికి సుముఖత తెలిపితే అభ్యర్థి విషయం కోచింగ్ సంస్థ (శిక్షణ సంస్థ) డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

పైన పేర్కొన్న అర్హతలు, నియమ నిబంధనలకు లోబడి కింద ఇచ్చిన వివిధ విద్యార్థుల వ్యక్తిగత సమాచారాన్ని ఆధారంగా చేసుకొని ఐచ్ఛికాల్లో తెలిపిన సమాధానాల్లో ఏది సరైనదో నిర్ణయించండి.

1. అవినాష్ ఎంటెక్ 70% మార్కులతో పూర్తి చేశాడు. పుట్టిన తేదీ 2002 జూన్ 1. అవినాష్ సంరక్షకుల వార్షికాదాయం రూ.96,000. అవినాష్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ దగ్గరే ఉండటానికి, అయిదో పాయింట్‌లో తెలిపినట్లు అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) అవినాష్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు
బి) అవినాష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
సి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
డి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) అవినాష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (డి)

వివరణ: అవినాష్ పుట్టిన తేదీ 2002 జూన్ 1. ప్రశ్నలో తెలిపిన 2023 మే 25 నాటికి అవినాష్‌కి 21 సంవత్సరాలు మాత్రమే. వయసు సరిపోదు కాబట్టి అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు.

2. దినేష్ ఎమ్మే 56% మార్కులతో పూర్తి చేశాడు. అతను పుట్టినతేదీ 1996 ఆగస్టు 24. డిగ్రీలో అతనికి 82% మార్కులు లభించాయి. దినేష్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.93,000/-. శిక్షణ పూర్తయిన తరవాత పరీక్ష తేదీ వరకు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు.

ఎ) దినేష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) దినేష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) దినేష్ ఇచ్చిన సమాచారం సరిపోదు.
డి) దినేష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది ఇ) దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (ఇ)

వివరణ: దినేష్‌కు ఇచ్చిన అర్హతలలో 2, 3, 4, 5 అర్హతలు ఉన్నాయి. ఒకటో అర్హతకు బదులుగా 6వ పాయింట్‌లో తెలిపిన విధంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 82% మార్కులు పొందడం వలన దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

3. వికాస్ ఎమ్మెస్సీ 70% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.60,000/-. కోచింగ్ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దనే ఉండటానికి నిశ్చయించుకుని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) వికాస్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) వికాస్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) ఇచ్చిన సమాచారం సరిపోదు
డి) వికాస్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది
ఇ) వికాస్ విషయం శిక్షణాసంస్థ డైరెక్టర్ పరిశీనలకు వెళుతుంది

సమాధానం: (సి)

వివరణ: వికాస్ పుట్టినతేదీ గురించి ఎటువంటి సమాచారం లేదు.

4. తేజ ఎమ్మే 75% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.78,000/-. కాని శిక్షణ పొందడానికి 15,000/- చెల్లించడానికి అంగీకరించాడు. శిక్షణకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. కాని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేయలేదు. తేజ పుట్టిన తేదీ 1996 జూన్ 11.

ఎ) తేజ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
బి) తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
సి) తేజ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు డి) తేజ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) తేజ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (బి)

వివరణ: తేజకు ఇచ్చిన అర్హతలలో 1, 2, 3, 4 అర్హతలు ఉన్నాయి. అయిదో అర్హతకు బదులుగా ఏడో పాయింట్‌లో తెలిపిన విధంగా రూ.15,000/- చెల్లిస్తున్నందున తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

5. ప్రశాంత్ ఎంకామ్ 65% మార్కులతో పూర్తి చేశాడు. ప్రశాంత్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండడానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు. అతను పుట్టిన తేదీ 1994 ఏప్రిల్ 4. ప్రశాంత్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.1,20,000/-.

ఎ) ప్రశాంత్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
బి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అర్హుడు
సి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు
డి) ప్రశాంత్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు ఇ) ప్రశాంత్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (సి)

వివరణ: ప్రశాంత్ సంరక్షకుల వార్షికాదాయం రూ.1,20,000/-లు. మూడో అర్హతలో వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదని ఉన్నది. కాబట్టి ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

అటకెక్కిన 'ఫిష్ ఆంధ్ర'

వైసీపీ హయాంలో వస్తు సామగ్రి కొనుగోలులో భారీ అవినీతి

- లబ్ధిదారులకు భారమైన ఫ్రాంచైజీ, బ్రాండింగ్
- వినియోగదారుల నుంచి కరువైన ఆదరణ
- లక్షల్లో నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత



అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికే 'ఫిష్ ఆంధ్ర' అంటూ డప్పు కొట్టిన వైసీపీ ప్రభుత్వం... ఆచరణలో భారీ అవినీతికి తెరతీసింది. వైసీపీ పార్టీ రంగులతో, ప్రచార ఆర్భాటంతో ఆరంభమైన 2,300 యూనిట్లలో చాలా వరకూ మూతపడ్డాయి. లబ్ధిదారులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు రూ.లక్షల్లో నష్టపోయారు. టీడీపీ ప్రభుత్వం దీనిపై దృష్టిపెడితే అవినీతి చేపలు దొరికే అవకాశం ఉంది. లబ్ధిదారులకు నగదు రాయితీ ఇచ్చి, నిర్దేశిత ప్రమాణాలతో రిటైల్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పాల్సిన మత్స్య శాఖ... ఫ్రాంచైజీ రుసుము చెల్లించాలని, పరికరాలను తాము చెప్పిన సంస్థ నుంచే తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడే అవినీతి, అవకతవకలకు ఆస్కారం ఏర్పడింది. 'ఫిష్ ఆంధ్ర' కాస్తా... 'స్కామ్ ఆంధ్ర'గా మారింది. వస్తు సామాగ్రిని తమకు అనుకూలమైన సంస్థల నుంచి కొనుగోలు చేయించి, నిధుల గోల్‌మాల్‌కు తెరదీశారు. బ్యాంకు రుణం, కేంద్రం, లబ్ధిదారుని వాటా నిధులతో వస్తు సామాగ్రి కొనుగోలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన తనవంతు వాటాను విడుదల చేయలేదు. లైవ్ ఫిష్ టబ్, బల్లలు, చేపలు శుద్ధి చేసే పనిముట్లు, శీతలీకరణకు రిఫ్రిజిరేటర్, ఐస్ తయారీ యంత్రం తదితర వస్తువులు... నాణ్యత ఏ మాత్రం లేని వాటిని ఎక్కువ ధరకు కొనుగోలు చేయించారు. లోగుట్టుగా అవినీతికి పాల్పడిన వైసీపీ నేతలు, అధికారులు... ప్రచారాన్ని మాత్రం ఊదరకొట్టారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20,000 మందికి ఉపాధి లభించిందని వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. ఫ్రాంచైజీ పేరుతో ఆరంభంలో రూ.80 వేలు వసూలు చేసిన మత్స్య శాఖ... ఫిష్ ఆంధ్ర బ్రాండింగ్ కోసం ప్రతి నెలా రూ.7,000 చెల్లించాలన్న నిబంధన పెట్టింది. ప్రారంభించిన కొద్ది నెలలకే కొనుగోలు చేసిన వస్తు సామాగ్రిలో చాలా వరకూ మూలకు చేరింది. నిర్వహణ భారమయింది. లైవ్ ఫిష్ వ్యాపారానికి ఆదరణ లభించలేదు. దీంతో ఫిష్ ఆంధ్ర అటకెక్కింది. మళ్లీ 20 వేల మంది రోడ్డుపైకి వచ్చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పథకం తీరుతెన్నులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అనేక అవకతవకలు బయటపడతాయి.

బడితో చెడుగుడు!

నాడు-నేడుపై జగన్ సర్కారు చెప్పినవన్నీ అబద్ధాలే

- ప్రచారం కోసం పథకాన్ని వాడుకున్న వైసీపీ పెద్దలు
- చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే నిలిపేసిన వైనం
- మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టని నేతలు
- జగన్ ప్రభుత్వంలో మూడు వేల కోట్లు పక్కదారి
- ఇప్పుడు వాటినేం చేయాలంటూ అధికారుల కసరత్తు
- పథకం పేరు 'మన బడి-మన భవిష్యత్తు'గా మార్పు
- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నాడు-నేడు' పథకంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేస్తామని గత జగన్ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. అయితే ఇందులో ప్రచారం తప్ప పనులేం చేయలేదని తేలింది. చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే వదిలేసినట్లు వెల్లడైంది. ప్రభుత్వ బడుల్లో అద్భుతాలు అంటూ రాజకీయ లబ్ధి కోసం విశ్వప్రయత్నాలు చేసిన వైసీపీ పెద్దలు... వాటిలో మౌలిక సదుపాయాల పురోగతిపై దృష్టి పెట్టలేదు. దీంతో నాడు-నేడు మధ్యలోనే ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంచనా వేయగా నాడు-నేడు రెండో దశలో కేవలం 7.88శాతం పనులే పూర్తిచేసిన విషయం బయటపడింది. 22,311 బడుల్లో రెండోదశ పథకం ప్రారంభించగా కేవలం 1,759 బడుల్లో మాత్రం పనులు పూర్తయ్యాయి. 20,552 పాఠశాలల్లో మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పుడు వాటినెలా పూర్తిచేయాలన్న దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది. తొలుత కాంట్రాక్టు విధానంలో పనులు చేయించాలని యోచించినా, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని నిర్ణయానికొచ్చింది. కొత్తగా ఎన్నుకున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు పూర్తి చేయాలని భావిస్తోంది. పనులు ఏ దశల్లో ఉన్నాయి? ఇంకా ఏ మేరకు నిధులు అవసరం? అనేదానిపై పాఠశాల విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. కాగా 'నాడు-నేడు' పథకం పేరును 'మన బడి-మన భవిష్యత్తు'గా ప్రభుత్వం మార్చింది.

పనుల ప్రారంభంపైనా ఆరా

పనులు మధ్యలో వదిలేయడం ఒకెత్తు అయితే అసలు ఏ ప్రాతిపదికన బడుల్లో పనులు మొదలు పెట్టారనే అంశంపై కూడా పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. నాడు- నేడు పథకం ప్రారంభం నాటి అధికారులతో ఇటీవల సమావేశం నిర్వహించారు. ఆ బాధ్యతల నుంచి తప్పుకొని వెళ్లిపోయిన వారిని కూడా పిలిపించారు. మొదటి, రెండో దశల్లో పనులు ప్రారంభానికి బడులను ఏ ప్రాతిపదికపై ఎంపిక చేశారో తెలుసుకుంటున్నారు. నాడు-నేడు పేరుతో భారీగా నిధులు ఖర్చు చేశాక కొన్ని ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. తరగతుల విలీనం ప్రక్రియ చేపట్టడంతో కొన్ని బడుల్లో విద్యార్థుల సంఖ్య జీరోకు చేరింది. దీంతో అక్కడి టీచర్లను ఇతర పాఠశాలలకు పంపి, ఆ బడులకు తాళాలు వేశారు. అయితే విద్యార్థుల సంఖ్య అంతంతమాత్రంగా ఉన్న బడులను ఎందుకు ఎంపిక చేయాల్సి వచ్చిందో ఇప్పుడు వివరాలు సేకరిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలపై దృష్టి

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మెరుగ్గానే ఉన్నా ప్రాథమిక పాఠశాలల పరిస్థితి ఏటా దిగజారుతోంది. విద్యార్థులు లేక ఆ బడులు వెలవెలబోతున్నాయి. 20 మంది విద్యార్థులు కూడా లేని బడులు దాదాపు దాదాపు 12వేల వరకూ ఉన్నాయి. వీటిలో కేవలం ఒక్కరే టీచరు ఉన్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆ బడుల్లోనూ ఒక్కో తరగతికి ఒక టీచర్‌ను నియమించే ఆలోచన చేస్తోంది. దాంతోపాటు అన్ని బడుల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని, వచ్చే ఏడాది నాటికి టీచర్లను పెంచి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నించాలని ప్రణాళికలు రూపొందిస్తోంది.



ఎక్కడి పనులు అక్కడే

45వేల ప్రభుత్వ బడుల్లో మొత్తం మూడు దశల్లో మౌలిక సదుపాయాల కల్పన పూర్తిచేస్తామని జగన్ ప్రభుత్వం ప్రకటించింది. మొదటి దశలో 15,715 బడుల్లో పథకం ప్రారంభించగా, దాదాపుగా పూర్తయ్యాయి. రెండోదశ పనులు 2022లో ప్రారంభించారు. 22,311 బడుల్లో వసతులు అభివృద్ధి చేయడంతో పాటు అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. రూ.8వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన ఈ పనులకు ఇప్పటి వరకూ రూ.4,107 కోట్లు ఖర్చు చేశారు. అయితే రూ.7వేల కోట్లకు పైగా నిధులను వివిధ రూపాల్లో సమీకరించినా వాటిని పథకానికి వినియోగించకుండా పక్కదారి పట్టించారు. నిధుల లేమితో వేల సంఖ్యలో బడుల్లో పనులు మధ్యలో నిలిచిపోయి ప్రాంగణాలన్నీ అస్తవ్యస్తంగా మారాయి. దీనిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, కడప, విజయనగరం, మన్యం మినహా ఏ జిల్లాలోనూ పది శాతం పనులు కూడా పూర్తికాలేదు.

156 ఔషధాలపై కేంద్రం నిషేధం!

జాబితాను విడుదల చేసిన ఔషధ నియంత్రణ శాఖ


గుంటూరు(మెడికల్), ఆగస్టు 25: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని 156 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) మందులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. తక్షణం వీటి తయారీ, పంపిణీ, విక్రయాలు నిలిపివేయాలని కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. నిషేధించిన మందుల్లో పలు యాంటీ బయోటిక్, యాంటీ అలర్జీ, అధిక రక్తపోటు, నొప్పి నివారణ మందులు, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లు తదితరాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నియమించిన డ్రగ్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) సూచనల మేరకు ఈ మందులపై కేంద్ర ఆరోగ్య శాఖ నిషేధం విధించింది. ఈ మేరకు ఈనెల 12వ తేదీన గెజిట్ నోటిఫికేషన్‌ను వెలువరించింది. నిషేధ మందుల జాబితాను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది. తాజాగా గుంటూరు జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఆ నిషేధిత మందుల జాబితాను విడుదల చేశారు. వీటిని తక్షణం దుకాణాల నుంచి తొలగించాలని ఆదేశిస్తూ జిల్లాలోని హోల్‌సేల్, రిటైల్ మందుల దుకాణాదారులకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ మందుల కాంబినేషన్‌లో హేతుబద్ధత లేదని, పైగా రోగుల చికిత్సల్లో ఈ మందుల వినియోగం వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని డీటీఏబీ నిపుణులు పేర్కొన్నారు. బాగా ప్రాచుర్యంలో ఉన్న పలు ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు నిషేధిత మందుల జాబితాలో ఉండటం విశేషం. మెఫనమిక్ యాసిడ్, పారా సిటమాల్ కాంబినేషన్ ఇంజెక్షన్లను సాధారణంగా నొప్పి నివారణకు వినియోగిస్తారు. ఈ కాంబినేషన్ మందు వల్ల రోగుల్లో తీవ్రమైన దుష్ఫలితాలు తలెత్తుతున్నట్లు నిపుణులు గుర్తించారు. అదే విధంగా ఎసిక్లోఫెనాక్, పారాసిటమాల్ కాంబినేషన్ చాలా సాధారణంగా వైద్యులు ప్రిస్క్రైబ్ చేస్తుంటారు. ఈ కాంబినేషన్‌పైనా ప్రభుత్వం నిషేధం విధించింది. మొటిమల చికిత్స, ముక్కు దిబ్బడ, చర్మవ్యాధుల చికిత్సల్లో వాడే ఔషదాలు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. గతంలో 2018లో కేంద్ర ప్రభుత్వం 328 ఎఫ్‌డీసీ మందులపై నిషేధం విధించింది. ఆరేళ్ల తర్వాత మరోసారి పెద్ద సంఖ్యలో మందులపై నిషేధం విధిస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేయడం విశేషం.

1నుంచి బీజేపీ సభ్యత్వం: పురందేశ్వరి



సర్పవరం జంక్షన్ (కాకినాడ), ఆగస్టు 25: 'పదకొండవ ఆర్థిక శక్తిగా ఉన్నటువంటి భారతదేశాన్ని ప్రధాని మోదీ పాలనలో ఐదో ఆర్థిక శక్తిగా అవతరించి ప్రపంచ పటంలో ఆవిష్కరించింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మూడో ఆర్థికశక్తిగా చూడాలనే దిశగా బీజేపీ కూటమి ప్రయత్నిస్తోంది' అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. ఆమె కాకినాడలో పార్టీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించే పార్టీ సభ్యత్వ నమోదుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 37 లక్షల మంది సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆమె తెలిపారు. కాగా, త్వరలో జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి తమ మేనిఫెస్టోలో ఆర్టికల్ 370, 35ఏలను పునరుద్ధరిస్తామని ప్రకటించడాన్ని బట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే రీతిలో వ్యవహరిస్తారని మండిపడ్డారు. దీనిపై రాహుల్ గాంధీ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ: భువనేశ్వరి



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా పేద అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కుప్పంలో ఈ శిక్షణ ఉంటుందని, అర్హులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు.

గంజాయి ముఠా అరెస్టు

రేపల్లె, ఆగస్టు 25: ఐదుగురు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్టు పట్టణ సీఐ ఎ.మల్లికార్జున్‌రావు తెలిపారు. ఆదివారం రేపల్లె మండలంలోని బేతపూడి, పల్లెకూన వెళ్లే రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకే సచివాలయం వద్ద కొంతమంది గంజాయి విక్రయిస్తుండగా జిల్లా ఎస్పీ తుషార్‌దూడి, డీఎస్పీ మల్లికార్జున్‌రావు ఆదేశాలతో గంజాయి ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయి, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. భట్టిప్రోలు మండలం పల్లెకూన గ్రామానికి చెందిన ఆళ్ళమూడి సుదర్శన్, పులివర్తి రాధాకృష్ణ, కనపర్తి సువర్ణరాజు, పులివర్తి సుమంత్, సయ్యద్ గోపి, విచారపు నాగరాజును అరెస్టు చేసినట్లు తెలిపారు. కె.భానుప్రసాద్ పరారీలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

10 కేజీల గంజాయి స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 25: పట్టణంలోని గుంటూరు రోడ్డులోని స్వర్గపురి వద్ద శనివారం రాత్రి సుమారు 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ గుంటూరు రోడ్డులోని స్వర్గపురి వద్ద కొందరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎపీ స్పెషల్ పోలీస్ సిబ్బంది, రెండో పట్టణ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు ఈ దాడుల్లో బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన గుంజి సుబ్బారావు, బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం కొమ్మలపాడు గ్రామానికి చెందిన సుల్తాన్ బి, గుంటూరు జిల్లా వినుకొండ ‘ప చెందిన షైలపోగు వెంకటేశ్వరిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి పది కేజీల గంజాయి, రూ. 62,000 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు.

వరవకట్టను జల్లెడ పట్టిన పోలీసులు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 25: స్వల్ప వ్యవధిలోనే పట్టణంలోని మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరవకట్టలో రెండోసారి ఆదివారం తెల్లవారు జామున పోలీసులు జల్లెడ పట్టారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ కే. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, పదిమంది ఎస్సైలు, 100 మంది సిబ్బందితో వరవ కట్టను దిగ్బంధించి తనిఖీలు నిర్వహించారు ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 46 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు ఆధార్ కార్డు లేకుండా నివసిస్తున్న బీహార్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన 18 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఓ రౌడీ షీటర్‌ను మరో అనుమానిత షీటర్ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ కొమ్మనబోయిన నాగేశ్వరరావు తెలిపారు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి 7 గంటల మధ్య ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మారణాయుధాలు, కర్రలు బాణాసంచా కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు సరైన అనుమతి పత్రాలు సమర్పించి వాహనాలను సంబంధిత యజమానులు తీసుకెళ్లవచ్చని, లేనిపక్షంలో వాటిని న్యాయస్థానంలో ప్రవేశపెడతామ న్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న పలువురు వరవకట్ట లో షెల్టర్ తీసుకుంటున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

ఎన్టీఆర్ బస్టాండ్‌లో అనధికారిక విక్రయాలు

- నిబంధనలను ఉల్లంఘిస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు

గుంటూరు, ఆగస్టు 25: ఎన్టీఆర్ బస్టాండ్‌లో అనధికారిక విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. వ్యాపారులతో కొందరి సిబ్బంది లాలూచీ పడటంతో ఈ తతంగం సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్టాండ్‌లో పర్యవేక్షించాల్సిన అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) కె.సత్యనారాయణ మంగళగిరి డిపోకు ఇన్చార్జిగా వ్యవహ రిస్తుండటంతో ఇక్కడ పాలన మరింత గాడి తప్పిందన్న విమర్శలు వస్తున్నాయి. కొందరు వ్యాపారులు పోటీ పడి మరీ టెండర్లు దక్కించుకొని దుకాణాల్లో వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేగాక పలువురు ప్రయాణికుల నుంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ అవి బుట్టదాఖలు అవుతున్నాయి.

చిల్లర పేరుతో నిలువు దోపిడీ

బస్టాండ్‌లో ఉన్న కొన్ని దుకాణాల వారు చిల్లర పేరుతో ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇటీవల ఓ స్టాల్‌లో ప్రయాణికుడు వ్యాపారికి రూ. 500 ఇచ్చాడు. వ్యాపారి రూ.50 తీసుకోవాల్సి ఉండగా, చిల్లర లేదని రూ. 150 తీసుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు విషయం పోలీసుల దాకా వెళ్లినట్లు సమాచారం. ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయాలు జరుపుతున్నారు. ధరల పట్టికలు, ఫిర్యాదు చేయాల్సిన అధికారుల ఫోన్ నంబర్ల వంటి బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల టిక్కెట్ బుకింగ్ కౌంటర్‌లోనూ ఇలానే చిల్లర ఇచ్చే క్రమంలో వినియోగదారుడిని మోసం చేయటంతో విషయం అధికారుల వద్దకు చేరింది. మరో వైపు బస్టాండ్ ప్రాంగణంలోని మరుగుదొడ్ల నిర్వహణ కూడా అధ్వానంగా ఉంది. ప్లాట్‌ఫామ్‌లోని మరుగుదొడ్లలో మహిళల నుంచి కూడా రూ.10 వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బస్టాండ్ ఆవరణలో అడ్డగోలుగా నిలిపిన వాహనాలు



బస్టాండ్‌లో ఎటు చూసినా వాహనాలే..

ఎన్టీఆర్ బస్టాండ్ ఆవరణలో ఎటుచూసినా అనధికార వాహనాల పార్కింగ్ కనిపిస్తుంది. వాస్తవానికి బస్టాండ్ ఆవరణ లోపల వాహనాల రాకపోకలకు నిషేధం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

పశ్చిమ డెల్టా కాల్వకు 7508 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 25: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 7508 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారు దలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండ గా, దిగువకు 18,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 330 క్యూసెక్కులనీరు, రేపల్లెకాల్వకు 1889, తూర్పుకాల్వకు 690, పశ్చిమకాల్వకు 230, నిజాంపట్నంకాల్వకు 460, కొమ్మమూరుకాల్వకు 3260 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అనువాద కొండ.. బెల్లంకొండ



సదస్సులో ప్రసంగిస్తున్న రచయిత, పాత్రికేయులు రెంటాల జయదేవ్, ప్రముఖులు.

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 25: తెలుగు అనువాద సాహిత్యంలో బెల్లంకొండ అనువాద కొండగా నయగార కవులలో ఒకరైన బెల్లంకొండ రామదాసును ప్రముఖ రచయిత, పాత్రికేయులు రెంటాల జయదేవ్ అభివర్ణించారు. ఆదివారం పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో కేంద్ర సాహిత్య అకాడమి, పల్నాడు కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో జరిగిన బెల్లంకొండ రామదాసు శత జయంతి సదస్సులో పాల్గొన్న ఆయన బెల్లంకొండ అనువాద సాహిత్యంపై పత్ర సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఆయన బెల్లంకొండ తన తండ్రి రెంటాల గోపాల కృష్ణతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఇద్దరూ కలిసి అనువదించిన రష్యన్ క్లాసిక్ యుద్ధం శాంతి నవలను విశ్లేషించారు. బెల్లంకొండ సాహిత్యంలో చేయని ప్రక్రియ లేదన్నారు. సదస్సులో స్వాగతోపన్యాసం చేసిన కేంద్ర సాహిత్య అకాడమి తెలుగు సలహా సంఘం కన్వీనర్ సి. మృణాలిని మాట్లాడుతూ బెల్లంకొండ పుట్టిన ఊరులోనే ఆయన శత జయంతి నిర్వహించడం ముదావహమన్నారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ నయగార కవిగా బెల్లంకొండ అనే అంశం గురించి మాట్లాడారు. నాటక రచయిత కందిమళ్ల సాంబశివరావు బెల్లంకొండ నాటకాలను విశ్లేషించారు. రచయిత మన్నే శ్రీనివాసరావు బెల్లంకొండ నాటికలను, జడ సుబ్బారావు బెల్లంకొండ కథలను విశ్లేషించి, పత్రాలు సమర్పించారు. రచయిత, పాత్రికేయులు సయ్యద్ నశీర్ అహ్మద్ బెల్లంకొండ కుటుంబ నేపథ్యాన్ని వివరించారు. సదస్సును తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రచయితలు సుజాత వేల్పూరి, అనిల్ బత్తుల, చేపూరి వెంకట్రావ్, కట్టా సిద్దార్ గంధం యాజ్ఞవల్క్యశర్మ, యన్నం నర్సిరెడ్డి, కేవీకే రామారావు లను నిర్వాహకులు సన్మానించారు. కళాక్షేత్రం కార్యదర్శి యస్.యం.బాషా సదస్సును నిర్వహించారు. కళాక్షేత్రం వ్యవస్థాపకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి పర్యవేక్షించారు. సదస్సు ఎండీ సర్దార్ పాషా, షేక్ బాజీ మస్తాన్, బాజాన్, మూర్తి, అమీర్ బాషా, ఎస్. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మొదటి విద్యాధికారి శ్రీనాథుడే

ఏయూ ఆచార్య డాక్టర్ బూసి వెంకట స్వామి

ఫిరంగిపురం, ఆగస్టు 25: దేశంలో మొట్టమొదటి విద్యాధికారి కవి సార్వభౌముడిగా వెలుగొందిన శ్రీనాథుడేనని ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్య డాక్టర్ బూసి వెంకట స్వామి అన్నారు. ఆదివారం ఫిరంగిపురంలోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో కొండవీడు రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఉభయ రాష్ట్రాల శతాధికార కవి సమ్మేళనం సభలో ఆయన మాట్లాడారు. సామాజిక చైతన్యం కోసమే కొండవీటి రచయితల సంఘం ఏర్పడటం ముదావాహం అన్నారు. మొదటిగా గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావు, శ్రీనివాస అయ్యర్‌లు భాషోద్యమాన్ని ఉప్పెనగా చేశారన్నారు. అనంతరం కృష్ణ శాస్త్రి భావ కవిత్వాన్ని అందించారని తెలిపారు. అనంతరం అభ్యుదయ కవిత్వాన్ని కందుకూరి, రాయప్రోలు, గురజాడ, శ్రీశ్రీలు అందించారన్నారు. అనంతరం వచన, దిగంబర, దళిత కవిత్వం, బహుజన వాద కవిత్వం, హైస్కూల్ ఇలాంటి అనేక రకాల కవిత్వాలు తామర తంపరగా వచ్చాయన్నారు. 30 మంది వరకు పాల్గొన్న కవులు, రచయితలు, గాయకులు వచన కవిత్వం ద్వారా తెలుగు భాషను అద్వితీయంగా తెలిపారు. విశ్వ భాషలలో మేటి భాష తెలుగు భాష అని, ఆంధ్రా వైభవాన్ని అవనిలో చాటిన భాషా తెలుగు అని చెప్పారు. తెలుగు మనుగడ ప్రశ్నార్థకం కాకుండా చేయాలని తెలుగు తల్లి ఆర్తిస్తుందని, కవులు, రచయితలు తమ వచనాలు, గేయాలు, కవితల ద్వారా తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సయ్యద్ మహమ్మద్ రఫీ రచించి బాణీ కట్టిన పాటల క్యాసెట్‌ను విడుదల చేశారు. అలాగే చౌపాటి ప్రభాకర్ రచించిన పుస్తకాలను ఈఏ ఆచార్య జేసీ వెంకటస్వామి ఆవిష్కరించారు. కార్యదర్శి తోళ్ళమడుగు గోవిందయ్య, పరవస్తు చిన్నయ్య సూరి, వై.సుందర్, కవులు, రచయితలు పాల్గొన్నారు.



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ఏయూ ఆచార్య డాక్టర్ బూసి వెంకట స్వామి

స్థానిక సంస్థలకు అధికారాలు ఇవ్వాలి

గుంటూరు (కార్పొరేషన్), ఆగస్టు 25: రాజ్యాంగంలో ఆర్టికల్ 243 పేర్కొనట్లుగా స్వయం పాలక ప్రభుత్వాలుగా స్థానిక సంస్థలకు అధికారాలివ్వాలని మాజీ రాజ్యసభ సభ్యులు, ఏపీ కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ యన్.తులసీరెడ్డి సూచించారు. గ్రామీణ, పట్టణ స్థానిక ప్రభుత్వాలకు విధులు, నిధులు, అధికారాలను బదిలీ చేస్తేనే బలోపేతం అవుతాయని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమౌతుందని వివరించారు. గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో స్థానిక ప్రభుత్వాల సాధికారతపై జరిగిన చర్చాగోష్ఠికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యన్. తులసీ రెడ్డి ప్రసంగిస్తూ గత రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల నిధులను దారి మళ్లించి వాటిని నిర్వీర్యం చేయడం దురదృష్టకరమన్నారు. వాలంటరీ, సచివాలయ వ్యవస్థలను పంచాయతీలకు సమాంతర వ్యవస్థలుగా మార్చి సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మిగిల్చినారన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందకుండా దేశాభివృద్ధిని ఆశించలేమన్నారు. శాసన మండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించకుండా రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి ఎలాంటి నిధులను స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వలేదన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్ కార్యాచరణ ద్వారా స్థానిక ప్రభుత్వాలు వికసిస్తాయన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే చేతుల్లో అధికారం కేంద్రీకృతం అవడం వలన అధికార, పాలన వికేంద్రీకరణకు ఆస్కారం లభించడం లేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాల నిధులు, విధులు, అధికారాల పై విస్తృతంగా చర్చలు జరగాలని, ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామసభలు విజయవంతంగా జరిగాయని, కేంద్ర ఆర్థిక నిధులు విడుదలయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షులు పోతుల బాలకోటయ్య, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, జన చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పి శేషుబాబు, నేస్తం సహా వ్యవస్థాపకులు ధనుంజయ రెడ్డి ప్రసంగించారు.



మాట్లాడుతున్న ఏపీ కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎన్.తులసీ రెడ్డి

ఏకగ్రీవంగా చేసిన తీర్మానాలు..

73వ రాజ్యాంగ సవరణలో గ్రామీణ ప్రాంతాల్లో పేర్కొన్న 29 అంశాలను, 74వ రాజ్యాంగ సవరణలో పట్టణ ప్రాంతాలకు పేర్కొన్న 18 అంశాలను దశల వారీగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు కేటాయించి అమలు చేయాలి. గ్రీన్ అంబాసిడర్స్ జీతాలు 6000 నుంచి 10,000 పెంచి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. 5 వ రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను వెంటనే స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయాలి. 15వ కేంద్ర ఆర్థిక సంఘం నిధులను ఇచ్చిన వెంటనే స్థానిక ప్రభుత్వాలకు ఎలాంటి జాప్యం లేకుండా బదిలీ చేయాలి. రాజకీయాలకు అతీతంగా సర్పంచులందర్నీ ఒకే విధంగా చూడాలి. ఉపాధి హామీ పథకాన్ని ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా అమలు చేయాలన్న తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

శత జయంతి ఉత్సవాల నిర్వహణకు ప్రాధాన్యం



సి.మృణాళిని

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 25: కవుల, రచయితల శత జయంతి ఉత్సవాల నిర్వహణకు సాహిత్య అకాడమీ ప్రాధాన్యమిస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం కన్వీనర్ సి.మృణాళిని చెప్పారు. ఆదివారం స్థానిక భువన చంద్ర టౌన్ హాల్‌లో జరిగిన బెల్లంకొండ రామదాసు శత జయంతి సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె సాహిత్య అకాడమీ చేపట్టే పలు సాహిత్య కార్యక్రమాల గురించి ఆంధ్రజ్యోతికి వివరించారు. తొలితరం రచయితలు, కవులు, వారి సాహిత్యం ఈ తరానికి తెలియజెప్పాలనే ఉద్దేశంతో జయంతి సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. నగరాల్లో కాకుండా ఆ రచయితలు పుట్టిన ఊర్లలోనే నిర్వహించాలని భావిస్తున్నట్లు చెప్పారు. బెల్లంకొండ రామదాసు పుట్టిన ఊరైన నరసరావుపేటలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అకాడమీ తరపున కవిసంధి, విమర్శకుడితో ఒక సాయంత్రం, మీట్ ద రైటర్ వంటి సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం తెలంగాణలో రెండు, ఆంధ్రాలో రెండు కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే నిజామాబాద్‌లో సాహిత్యంలో పర్యావరణంపై సదస్సు, సాహిత్యంలో ప్రపంచీకరణ అంశంపై బెనారస్‌లో సదస్సు చేసినట్లు చెప్పారు. ప్రచురణల విషయంలో జీవిత చరిత్రలకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఆమె తెలిపారు. దేశవ్యాప్తంగా ఢిల్లీలో ఆరు రోజులు సదస్సు జరుగుతుందని, తెలుగు రాష్ట్రాల నుంచి రచయితలకు ఆహ్వానం ఉంటుందని పేర్కొన్నారు. గొప్ప సాహిత్యకారుల జీవితాలపై డాక్యుమెంటరీ తీసే ప్రణాళిక చేస్తున్నట్లు చెప్పారు. అకాడమీ తరపున నిర్వహించే ప్రతి సదస్సును పుస్తక రూపంలో తీసుకొస్తామని చెప్పారు.

1.0634 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 25: నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శనివారం అర్ధరాత్రి వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0634 ఎంయూల విద్యుత్ తయారైందని ఎస్ఈ కె.వెంకట రమణ చెప్పారు. ప్రాజెక్టు 3 క్రస్ట్ గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 21,258, టేల్ రేస్ ఛానల్ ద్వారా 8,608 మొత్తంగా 29,866 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 29 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.46 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.053 టీఎంసీకి సమానమన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 25: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 589.50 అడుగులు ఉంది. ఇది 311.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,076 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,367 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,867 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 48,710 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 48,710 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 25: పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 48,541 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 57,952 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు. పవర్ జనరేషన్ ద్వారా 16 వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందని తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలు



క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేస్తున్న సీఆర్ క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు చెరుకూరి కాంతయ్య

చిలకలూరిపేట, ఆగస్టు 25: ఆంధ్రరాష్ట్ర క్యారమ్ సంఘ పర్యవేక్షణలో పల్నాడు జిల్లా క్యారమ్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ క్లబ్‌లో రెండు రోజులు పాటు జరిగిన రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు చెరుకూరి కాంతయ్య, రాష్ట్ర క్యారమ్స్ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. శ్రీగిరిరాజు కృష్ణమూర్తి జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు రూ.25 వేలు క్రీడాకారులకు అందజేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. పురుషుల జట్టులో ప్రథమ స్థానం సీహెచ్ జనార్ధన్ రెడ్డి(విశాఖపట్నం), ద్వితీయ స్థానం బి.రవీంద్ర రెడ్డి (గుంటూరు), తృతీయ స్థానం జి.జయకుమార్ (గుంటూరు), నాలుగో స్థానం కె.ఉమామహేశ్వర రావు(ఎన్టీఆర్), 5వ స్థానం బి.పవన్ కుమార్(అనంతపూర్), 6వస్థానం టి.మల్లికార్జున (గుంటూరు). మహిళల విభాగంలో ప్రథమ స్థానం ఎంఎస్‌కే హారిక (విశాఖపట్నం), ద్వితీయ స్థానం ఎల్ హరిప్రియ (విశాఖపట్నం), తృతీయ స్థానం ఎన్.రాజ్యలక్ష్మి(గుంటూరు), 4వ స్థానం ఎస్‌కే హస్నాసమీరా (విశాఖపట్నం) నిలిచారు. కార్యక్రమంలో జిల్లా క్యారమ్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చల్లగుంట్ల అజయ్ బాబు, బోయపాటి రవితేజ, రాష్ట్ర సంఘం ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుర్రా శ్రీనివాసరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌వీ రమణ మూర్తి, టోర్నమెంట్ కన్వీనర్ శర్మ, చీఫ్ రిఫరీ డీఎస్ఆర్ మూర్తి, అసిస్టెంట్ చీఫ్ రిఫరీ సిరాజ్ బాష పాల్గొన్నారు.

వెటరన్ టీ-20 క్రికెట్ విజేత గుంటూరు



చాంపియన్‌గా నిలిచిన గుంటూరు జట్టు

నెల్లూరు (విద్య), ఆగస్టు 25: నెల్లూరులోని సీఐఏ క్రికెట్ మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వెటరన్ టీ-20 క్రికెట్ పోటీల్లో గుంటూరు జట్టు చాంపియన్‌గా నిలిచింది. సీనియర్ క్రీడాకారుడు తాటిపర్తి సునీల్‌కుమార్ స్మృత్యర్థం వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు, నెల్లూరు జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 165 పరుగులు సాధించింది. ఎం.రాజాకృష్ణ 98 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసి విజేతగా నిలిచింది. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు పి.భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

చిలకలూరిపేట, ఆగస్టు 25: రోడ్డు ప్రమాదంలో బాలిక ఆదివారం దుర్మరణం చెందింది. ఈ మార్గంలో మద్దిరాల - పోతవరం గ్రామాల మధ్య తొలుత రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఒక ద్విచక్ర వాహనంపై తండ్రితో కలిసి ప్రయాణం చేస్తున్న బాలికను మృత్యువు వెంటాడింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనం పక్కనే వెళుతున్న గ్రానైట్ లోడు లారీ కింద బాలిక పడి అక్కడి కక్కడే మృతి చెందింది. మృతి చెందిన బాలిక మద్దిరాల గ్రామానికి చెందిన హసిఫా (15)గా పోలీసులు గుర్తించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



భర్తిపూడి గ్రామ సమీపంలోని పంట కాల్వ మట్టిని వైసీపీ నాయకులు తవ్విన చిత్రం

భర్తిపూడిలో మితిమిరిపోతున్న వైసీపీ నాయకుల ఆగడాలు

● పంట కాల్వ మట్టిని సైతం తవ్వేస్తున్న వైనం

బాపట్లరూరల్, ఆగస్టు 25 : బాపట్ల మండలం భర్తిపూడి గ్రామంలో వైసీపీ నాయకుల ఆగడాలు రోజు రోజుకు మితిమించిపోతున్నాయి. భర్తిపూడి-గుడిపూడి గ్రామాల మధ్య ఉన్న పంట కాల్వ కట్టలను జేసీబీల ద్వారా తవ్వి ట్రాక్టర్ల ద్వారా మట్టిని వైసీపీ నాయకులు తరలించుకొనిపోయారు. కాల్వకట్ట మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్థులు డ్రైనేజి ఏఈకి ఫిర్యాదు చేయగా ఘటన స్థలానికి చేరుకొని ఏఈ పరిశీలించారు. ఈ విషయంపై డ్రైనేజీ ఏఈ భరద్వాజను వివరణ కోరగా పంటకాల్వ కట్టలను జేసీబీల ద్వారా తవ్వి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించటం జరిగిందని, అయితే ఘటన స్థలానికి చేరుకునే లోపు ఎటువంటి వాహనాలు అక్కడ లేవన్నారు. పంట కాల్వకట్టను భర్తిపూడి వైసీపీ ఎంపీటీసీ పులి బ్రహ్మయ్య ఎక్స్‌కవేటర్ల ద్వారా తవ్వించి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించారంటూ భర్తిపూడి, గుడిపూడి గ్రామాల సర్పంచ్‌లు అమరేష్, హనుమాజి ఫిర్యాదు చేయగా ఆయనపై రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయటం జరిగిందని ఏఈ భరద్వాజ తెలిపారు.

నేటి నుంచి క్రీడా సంబరాలు

● జిల్లా క్రీడాధికారి కె.పాల్‌కుమార్

బాపట్ల, ఆగస్టు 25 : హాకీ క్రీడాకారుడు ధ్యానచంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడాదినోత్సవంలో భాగంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాధికారి కె.పాల్‌కుమార్ తెలిపారు. ఈ సంబరాలలో భాగంగా 26వ తేదీన జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, కళాశాలలలో క్రీడాకారులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, 27న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలలో క్విట్ ఇండియా ప్రతిజ్ఞ చేయాలని పీఈటీ, పీడీలను కోరారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల క్రీడాకారులకు వివిధ క్రీడాపోటీల నిర్వహణ, 29వ తేదీన 3కె ర్యాలీ నిర్వహణ, అత్యుత్తమ క్రీడాకారులకు సన్మానం జరుగుతుందన్నారు. 30, 31 తేదీలలో సామాజిక మాధ్యమాల ద్వారా క్రీడా ఐక్యత, సృజనాత్మక క్రీడాచిత్రాలు, లఘుచిత్రాలు, వ్యాసరచన చిత్రకళప్రదర్శన ఉంటుందన్నారు. అలాగే వాకింగ్, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, షటిల్, చెస్, బాక్సింగ్ పోటీలు బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరపబడుతాయన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్‌లు, మెడల్స్ బహుమతులు ఇవ్వబడతాయన్నారు.

పండుగ వాతావరణంలో సభ్యత్వ నమోదు చేపట్టాలి

● బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పులి కృష్ణారెడ్డి

బాపట్ల, ఆగస్టు 25 : భారతీయ జనతాపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సెప్టెంబరు 1వ తేది నుంచి పండుగ వాతావరణంలో చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి పులి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం జిల్లా పార్టీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ అధ్యక్షతన సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మొదలయ్యే సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పార్టీశ్రేణులంతా సిద్ధం కావాలన్నారు. ఈ సదస్సులో మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, పార్లమెంట్ ఇన్‌చార్జి బండారుపల్లి హేమంత్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముప్పల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, గణేష్, భావన్నారాయణ, జగన్నాథశాస్త్రి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మామిడి రమేష్‌కుమార్, సూర్యనారాయణ, జిల్లాలోని నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పులి కృష్ణారెడ్డి

భూములు పంపిణీ చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తాం : సీపీఐ

బాపట్ల, ఆగస్టు 25 : రాష్ట్ర వ్యాప్తంగా పేదలకిచ్చిన భూములను పంపిణీ చేసేంతవరకు సీపీఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్ అన్నారు. పట్టణంలోని శృంగారపురం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం భూ బాధితుల రాష్ట్ర సదస్సు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన విజయవాడలో జరిగే సదస్సుకు బాధితులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. 70 సంవత్సరాల క్రితం బాపట్ల నియోజకవర్గంలో పేదల కొరకు అసైన్డ్ భూములను ఆనాటి ప్రభుత్వాలు పంపిణీ చేయటం జరిగిందన్నారు. కాని ఆ భూములన్ని ఆనాడు మౌలిక వసతులు లేని కారణంగా పేదలు వారి అవసరాల నిమిత్తం, పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు చేయటానికి ఆర్థిక స్థోమత లేక పట్టించుకోకుండా వదిలేశారన్నారు. దీంతో పెత్తందారులు భూములను ఆక్రమించి వారి సొంత ప్రయోజనాల కోసం కళాశాలలు, వ్యాపార సముదాయాలు, కళ్యాణమండపాలు, ఇతర సదుపాయాలు కల్పించుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మామిడిబత్తుల అశోక్, గణేష్, కంచర్ల ఏసురత్నం, యలమంద, రవి, ఎం.వెంకటేశ్వరరావు, బి.ఫణి, పూర్ణ పాల్గొన్నారు.

పెదగొల్లపాలెం శివాలయాన్ని దర్శించిన చీరాల ఎమ్మెల్యే కొండయ్య

కర్లపాలెం, ఆగస్టు 25 : మండలంలోని పెదగొల్లపాలెం గ్రామంలో ఉన్న శివాలయాన్ని చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య ఆదివారం దర్శించారు. పూజలు చేసి నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపాన్ని సందర్శించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, బోయన ముసలయ్య, పమిడి లక్ష్మణరావు, గ్రామయువత తదితరులు పాల్గొన్నారు.



బీపీ మండల్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు తదితరులు

బీపీ మండల్‌కు ఘన నివాళి

బాపట్ల, ఆగస్టు 25 : సమాజ్‌వాది పార్టీ బాపట్ల జిల్లా శాఖ ఆధ్వ ర్యంలో ఓబీసీ రిజర్వేషన్‌ల పితామహుడు బీపీ మండల్ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు పార్టీశ్రేణులతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని ప్రతి నభూనారు. కార్యక్రమంలో మద్దిబోయన తాతయ్య, కాండ్రు శరత్‌కుమార్, మోర్ల చిన వెంకటేశ్వరరావు, అంగలకుదురు నటరాజన్, మారం రవికుమార్, ధూళిపూడి బసవయ్య, గండికోట వెంకట్రావు, బోయన సూరిబాబు, కొండా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పిట్టలవానిపాలెం, ఆగస్టు 25 : శ్రావణ మాస ఆదివారం సందర్భంగా శ్రీ బగళాముఖి అమ్మవారికి భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారికి శ్రావణ ఆదివారాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్థలాలు లేకుండా నిర్మాణాలకు నిధులు మంజూరు

● ప్రారంభించిన పనులు వదిలేసిన వైనం

● మంజూరైన రూ.10కోట్లు ఏమయ్యాయో?

వేమూరు, ఆగస్టు 25 : వైసీపీ పాలనలో జరిగిన మోసాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించకుండానే నిధులు మంజూరు చేసిన వైనం ఇది. వేమూరు మండలంలో 36 ప్రభుత్వ భవనాల నిర్మాణం నిమిత్తం దాదాపుగా రూ.10 కోట్ల నిధులు కేటాయించారు. ఆయా పనులకు సంబంధించి 2020-21 ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయింపుతో పాటు తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయా పనులను వైసీపీ నాయకులకే కట్టబెట్టారు. 36 భవనాలకు గాను నాలుగు భవనాల నిర్మాణాలు పూర్తి చేశారు. ఏడు భవనాల నిర్మాణాలను చివరి దశకు తీసుకువచ్చి వదిలేశారు. ఆరు భవనాలకు కేవలం బేస్మెంట్ నిర్మాణం కూడా పూర్తి చేయలేదు. మరో 19 భవనాలకు అసలు స్థలాలు కేటాయించలేదు. వివరాలు పరిశీలిస్తే... 14 గ్రామాల్లో సచివాలయాల నిర్మాణం కోసం ఒక్కొక్క దానికి రూ.40 లక్షలు చొప్పున రూ.5.60 కోట్లు కేటాయించారు. వాటిలో రెండు భవనాల పనిని పూర్తి చేశారు. ఐదు భవనాల పనులు చివరి దశకు తీసుకువచ్చి వదిలేశారు. రెండు భవనాలకు శంకుస్థాపనలు చేసి వదిలేశారు. ఐదింటికి అసలు స్థలాలు కేటాయించలేదు. రైతు భరోసా కేంద్రాలను 11 గ్రామాల్లో నిర్మించేందుకు ఒక్కొక్క దానికి రూ.21.80 లక్షల చొప్పున రూ.రెండు కోట్ల 39లక్షల 80 వేలు కేటాయించారు. వాటిలో కేవలం ఒక్క భవన నిర్మాణం మాత్రమే పూర్తయింది. మరో భవన నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేశారు. రెండింటికి శంకుస్థాపనలు చేసి వదిలేశారు. ఏడింటికి అసలు స్థలాలు చూపలేదు. ప్రాథమిక ఆరోగ్య భవనాల నిర్మాణం కోసం 11 గ్రామాల్లో నిర్మాణాలకు ఒక్కొక్క దానికి రూ.17.50 లక్షల చొప్పున ఒక కోటి 92లక్షల 50 వేలు కేటాయించారు. వీటిలో ఒక భవన నిర్మాణం పూర్తి చేసి మరొక దానిని సగంలో నిలిపివేశారు. రెండింటికి శంకుస్థాపనలు చేసి వదిలేశారు. మరో ఏడింటికి స్థలాలు కేటాయించలేదు. ఇదిలాఉండగా ఈ నిర్మాణం పనుల నిమిత్తంగా కేటాయించిన నిధుల్లో 70 శాతం వరకు కాంట్రాక్టర్లకు జమ చేసినట్టు సమాచారం. జమ చేసిన నిధులకు సంబంధించిన పనులు పూర్తి కాకపోవడంతో మంజూరైన నిధులపై అనుమానం వ్యక్తమవుతోంది. దీనిపై పూర్తి విచారణ జరపాల్సిన అవసరం ఉందని అధికార పార్టీ నాయకులు కోరుతున్నారు. స్థలాలు కేటాయించని వాటికి మంజూరైన నిధులు ఎటుదారి మళ్ళాయో పరిశీలించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ఏది ఏమైనా ఈ నిర్మాణాలపై స్థానిక ఎమ్మెల్యే సమగ్ర విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



చంపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం కేవలం బేస్‌మెంట్ లెవల్ పనులు కూడా పూర్తి చేయకుండా వదిలేసిన చిత్రం



కుచ్చెళ్ళపాడులో నిర్మాణం పూర్తి చేయకుండా వదిలి వేసిన గ్రామ పంచాయితీ భవనం

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి : జేసీ



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, డీఆర్వో సత్తిబాబు తదితరులు

బాపట్ల, ఆగస్టు 25 : లఖ్‌పతి దీదీ 100 రోజుల ప్రణాళికతో స్వయం సహాయక సంఘాలవారికి నిధులు సమకూర్చి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. దేశంలోని పేద మహిళలకు జీవనోపాధి అవకాశాలు కల్పించి వారిని లక్షాధికారులను చేయాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానం ద్వారా ఆదివారం తన సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో భాగంగా పొటెన్షియల్ లఖ్‌పతి దీదీలను, సీఆర్పీలను గురించి చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో లఖ్‌పతి దీదీ 100 రోజుల లక్ష్యం 1,22,160 మంది కాగా జిల్లాలో 4,620 మందిని టార్గెట్‌గా ఇవ్వటం జరిగిందన్నారు. వీరికి 100 రోజులలో సీఐఎఫ్, వీఆర్‌ఎఫ్, బ్యాంక్ లింకేజి, ఉన్నతి, స్త్రీనిధి ద్వారా సాయం అందించి ఆదాయం పెంచాలని తెలిపారు. అనంతరం వర్చువల్ మీటింగ్ హాజరైన లఖ్‌పతి దీదీలను, అజీవిక సీఆర్పీలను సన్మానించి సర్టిఫికెట్‌లు అందజేశారు. జిల్లాలో ఉన్న 25 మండలాలలోని 305 గ్రూప్‌లలో ఉన్న లఖ్‌పతి దీదీలకు 62 కోట్ల 75 లక్షల రూపాయల చెక్‌ను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి, జిల్లా సమైక్య పదాధికారులు బి.ద్రాక్షవాలి, ఎన్.స్వర్ణకుమారి, సీహెచ్ ధనలక్ష్మి, లఖ్‌పతి దీదీలు, సీఆర్పీలు, డీపీఎంయూ సిబ్బంది, ఏపీఎంలు సీసీలు తదితరులు పాల్గొన్నారు. ఎన్.జాన్‌బి, పి.దీనమ్మ, జె.ఆనంద్‌కుమారి, ఎస్‌కె.కైతున్, పి.పద్మావతి, కె.స్వప్న, డి.నాగమణి, కె.పోలేరమ్మలను సత్కరించి సర్టిఫికెట్‌లు అందజేశారు.

● కర్లపాలెం, ఆగస్టు 25 : మహిళలను లక్షాధికారులను చేయటమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి చెప్పారు. ఆదివారం లఖ్‌పతి దీదీ సంభావన లైవ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని మహిళా సంఘాల సభ్యులతో కలిసి వీక్షించిన అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ మహిళలకు రుణ సదుపాయం అందించి సహకరించటం జరుగుతుందన్నారు. అనంతరం సీఆర్పీలకు ప్రశంసపత్రాలు పంపిణీ చేసి కోటి రూపాయల స్త్రీనిధి చెక్కును మండల సమైక్య సభ్యులతో కలిసి దీదీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరెడ్డి, సీసీలు శివకోటేశ్వరరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, ఆగస్టు 25 : కేంద్ర ప్రభుత్వం స్వయంసహాయక సంఘ సభ్యులను లక్షాధికారులను చేసేందుకు నూతనంగా లఖ్‌పతి దీదీ పథకాన్ని ప్రవేశపెట్టిందని నియోజకవర్గ టీడీపీ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి అన్నారు. ఆదివారం చెరుకుపల్లిలోని శాంతిశ్రీ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన నూతన పథకం ప్రచారాన్ని మహిళా సభ్యులు వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహాయకసంఘసభ్యుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ వడ్డీకి రుణాలను అందిస్తున్నాయన్నారు. డ్వాక్రాలోని స్వయం సహాయక సభ్యులు రుణాలను పొంది అభివృద్ధి దిశగా పయనించాలని ఆయన కోరారు. పలు సంఘాలకు రూ.10 లక్షల చెక్కులను ఆయన అందించారు. కార్యక్రమంలో రేపల్లె ఏరియా కో ఆర్డినేటర్ రమాదేవి, మండల ఏపీఎం బి.వెంకటేశ్వర్లు, మండల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, ఆగస్టు 25 : లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని ఆదివారం కొల్లూరు వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఏపీఎం ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల సభ్యులతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ లబ్ధిదారులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా గ్రూపుల సభ్యులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

● చుండూరు, ఆగస్టు 25 : మహిళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు జరుపుతున్నాయని, గ్రామీణ మహిళలు వీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఏపీఎం షాలేమ్‌రాజు కోరారు. చుండూరు వెలుగు కార్యాలయంలో ఆదివారం లఖ్‌పతి దీదీ సీఆర్‌పీల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తించిన ఏడుగురు లఖ్‌పతి దీదీలకి ప్రత్యేక ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి అనీల్‌కుమార్, మున్నంగివారిపాలెం సర్పంచ్‌లు అమ్మిశెట్టి శ్రీరామ్‌మూర్తి, పోకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 25 : మండలంలోని జిఎస్‌పాలెం, సంగుపాలెం, అల్లూరు మంతెనవారిపాలెం గ్రామాలలోని శ్రీకృష్ణ దేవాలయాలలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామపంచాయతీలలోని కుర్పపాలెం, యాదవపాలెం గ్రామాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



కర్లపాలెం ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన రవీంద్రను అభినందిస్తున్న సిబ్బంది

కర్లపాలెం ఎస్‌ఐగా రవీంద్ర

కర్లపాలెం, ఆగస్టు 25 : కర్లపాలెం ఎస్‌ఐగా ఎస్.రవీంద్ర ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలకు ముందు ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ సస్పెండ్‌కు గురికావటంతో అప్పటి నుంచి ఇక్కడ ఇన్‌చార్జి ఎస్‌ఐలు పని చేస్తూ వచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీలలో భాగంగా ఎస్.రవీంద్రను నియమించటంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎస్‌ఐ రవీంద్రకు అభినందనలు తెలిపారు.

పూర్ణచంద్రరావుకు ఘనసన్మానం



పూర్ణచంద్రరావును సన్మానిస్తున్న జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి, ఏపీఎం శ్రీనివాసరెడ్డి తదితరులు

కర్లపాలెం, ఆగస్టు 25 : కర్లపాలెం మండల సమైక్య కార్యాలయంలో సీసీగా పనిచేస్తున్న శాంతి పూర్ణచంద్రరావు బదిలీ కావటంతో ఆదివారం మండల సమైక్య ఆధ్వర్యంలో ఆయనకు ఘనసన్మానం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఘనంగా సత్కరిం చి సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరెడ్డి, సిబ్బంది లక్ష్మి, మార్తమ్మ, శివపార్వతి, మంజుల, కుంచాల లక్ష్మీశాలిని పాల్గొన్నారు.

ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా నారాయణ

బాపట్ల, ఆగస్టు 25 : బాపట్ల ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా జి.నారాయణ ఆదివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. 2002వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన నారాయణ గతంలో టీటీడీ విజిలెన్స్‌లో విధులు నిర్వహించారు. ఐజి ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం గుంటూరు రేంజ్ వీఆర్ నుంచి బదిలీపై బాపట్ల వచ్చారు.

29న అష్టకుండాత్మక లక్ష్మీకుబేర హోమార్చన

బాపట్ల, ఆగస్టు 25 : ఏకాదశి, శ్రావణమాసం, ఏకాదశి తిధి, ఆరుద్ర నక్షత్రాలు ఏకాదశి గురువారంతో కలిసి రావటం అత్యంత అరుదుగా సంభవించే విశేష యోగవంతమైన రోజును పురస్కరించుకొని ఈనెల 29వ తేదిన శ్రీలలిత త్రిపురసుందరీ పీఠం ఆధ్వర్యంలో అష్టకుండాత్మక లక్ష్మీకుబేర హోమార్చన, పుష్పార్చన, కుంకుమార్చన, అష్టదశ నైవేద్యాలు సమర్పిస్తున్నట్లు కన్వీనర్ నెమలికంటి హనుమంతరావు తెలిపారు. చీలురోడ్డు సెంటర్‌లోని శ్రీపాండురంగాస్వామి దేవాలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా నిర్వహించే కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9701489906 నెంబరును సంప్రదించాలన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

బాపట్ల, ఆగస్టు 25 : పట్టణంలోని 9వ వార్డు చిల్లరగొల్లపాలేనికి చెందిన దాది శ్రీనివాసరావు బైక్‌పై తన స్నేహితుడితో కలిసి బాపట్ల పాతబస్టాండ్‌కు వచ్చి టిఫెన్ చేసి తిరిగి వెళుతుండగా జీబీసీ రోడ్డులోని ఆర్‌వోబిపై కారు ఎదురొచ్చి ఢీకొట్టినట్లు సీఐ అహ్మద్‌జానీ తెలిపారు. క్షతగాత్రులు గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులకు గాయాలు

కొల్లూరు, ఆగస్టు 25 : మండల పరిధిలోని ఆవులవారిపాలెం గ్రామానికి చెందిన యేసుబాబు తన ఐదేళ్ల కుమారుడితో పాటు ద్విచక్ర వాహనంపై వెల్లటూరు వైపు నుంచి స్వగ్రామం వస్తుండగా దోనేపూడి వద్ద టాటా మెజిక్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో తండ్రి యేసుబాబు తీవ్రంగా గాయపడగా కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

శ్రీ ఆడమ్మ అమ్మవారికి స్వర్ణనేత్రాలు బహుకరణ

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 25 : శ్రీ ఆడమ్మ అమ్మవారికి స్వర్ణ నేత్రాలు బహుకరణ చేశారు. శ్రీ ఆడమ్మ తల్లి అమ్మవారికి ఆదివారం భక్తులు సారె సమర్పించి పూజలు చేశారు. మద్దుల శ్రీనివాసరావు కుమారుడు మద్దుల శ్రీరామచంద్రమూర్తి, పద్మప్రియ దంపతులు ఈ సందర్భంగా స్వర్ణ నేత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొలిశెట్టి శ్రీనివాసరావు, సభ్యులు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ కమిటీ సిబ్బంది దాతలకు ధన్యవాదాలు తెలిపారు.



అమ్మవారికి స్వర్ణనేత్రాలు సమర్పిస్తున్న భక్తులు

సామాజిక విభాగాల్లో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలి

రేపల్లె, ఆగస్టు 25 : సామాజిక విభాగాల్లో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. పట్టణంలోని రేపల్లె ప్రాంతీయ శాఖలోని రేపల్లె, నగరం, నిజాపట్నం, చెరుకుపల్లి మండలాల యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తిలో విద్యార్థులను తీర్చిదిద్దే పనిలో కాకుండా మానసిక ఉల్లాసం కోసం కొంతసేపు క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు. ఈ పోటీల్లో గెలిచిన వారికి సెప్టెంబరు 1వ తేదీన జిల్లా స్థాయి పోటీలు బాపట్లలో, అనంతరం రాష్ట్రస్థాయి పోటీలు గుంటూరు బీఆర్ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. మానసిక ఉల్లాసం కోసం ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని, సమాజంలో అంకితభావంతో పని చేసేది ఉపాధ్యాయులే అన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు కోనేరు సాయిప్రసాద్, రాజాభూషణం, దుర్గారావు, రవీంద్ర, లక్ష్మణుడు, రాధాకృష్ణ పాల్గొన్నారు.



ఆటల పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 25 : చేనేత కార్మికులు, పద్మశాలీలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయనున్నట్లు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మార్కండేయ, పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షులు బట్టు మల్లికార్జునరావు తెలిపారు. భట్టిప్రోలులో సేవా సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలో ఆదివారం చేనేత కార్మికుల పద్మశాలీల పిల్లలకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. దాత వంగర రవికాంత్ సాయంతో ఈ నోట్ పుస్తకాలు విద్యార్థులకు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కౌతరపు శివనాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి అందే శివప్రసాద్, కమిటీ సభ్యులు తాడిపర్తి సత్యనారాయణ, బట్టు వెంకటేష్, ఒగ్గి హనుమంతరావు, టీడీపీ నాయకులు కారంపూడి శంకరరావు పాల్గొన్నారు.

డాడ్జ్‌బాల్ పోటీలకు జాతీయ జట్టు ఎంపిక

కొల్లూరు, ఆగస్టు 25 : డాడ్జ్‌బాల్ పోటీలకు జాతీయ జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేశారు. మండల పరిధిలోని చిలుమూరు శ్రీరామా రూరల్ సంస్థలో డాడ్జ్‌బాల్ జాతీయ జట్టు అండర్-19 బాలుర, బాలికలు జట్లకు సంబంధించి 21 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. నవంబరు 2, 3 తేదీల్లో మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరగనున్న అంతర్జాతీయ డాడ్జ్‌బాల్ పోటీల్లో భారత దేశం నుంచి వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాల నుంచి జట్టుకు 15 మంది చొప్పున మొత్తం నాలుగు జట్లకు 60 మంది క్రీడాకారులను ఎంపిక చేయాల్సి ఉండగా 21 మందిని శ్రీరామాలో ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ డాడ్జ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొలసాని తులసీవిష్ణు ప్రసాద్, కన్వీనర్ నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి రాము, నిర్వాహకులు వణుకూరి గోపి పాల్గొన్నారు.



డాడ్జ్‌బాల్ జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో తులసీవిష్ణు ప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు

సమాజాభివృద్ధిలో లయన్స్ క్లబ్ పాత్ర ప్రత్యేకమైనది

● వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ

బాపట్ల,ఆగస్టు 25 : సేవా కార్యక్రమాలను విస్తృత పరిధిలో చేపడుతూ సమాజాభివృద్ధిలో లయన్స్ క్లబ్ పాత్ర ప్రత్యేకమైనదని వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని జిఎస్‌ఎన్ టవర్స్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యక్రమానికి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను అంకితభావంతో చేపడుతూ ఎంతో ఘనచరిత్ర కలిగిన లయన్స్‌క్లబ్ ఇదేతరహా సేవలతో భవిష్యత్తులో కూడా మరింత ఖ్యాతిగడించాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించిన లయన్స్ గవర్నర్ బాలస్వామి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో చేపడుతున్న సమాజ సేవాకార్యక్రమాల స్ఫూర్తితో వినూత్న కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడిగా శీలం శ్రీనివాసరావు, కార్యదర్శిగా బి.రాజేంద్రప్రసాద్, కోశాధికారి ఇమ్మడిశెట్టి కోటేశ్వరరావులను ఎన్నుకొని ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో గోపాళం రఘుపతిరావు, శిఖంఫణిరాజశయన్, సత్యనారాయణ, సంగమేశ్వరశాస్త్రి, ఆలపర్తి శ్రీనివాసరావు, సుధాకర్‌గుప్తా, వక్కలగడ్డ శ్రీనివాసరావు, గణేషుల శివరామకృష్ణ, సమీరా, బుజ్జి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ రికార్డులు స్వాధీనం



గ్రామ పంచాయతీ రికార్డులు స్వాధీనం చేసుకుంటున్న డీఎల్‌పీవో నరసింహారావు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 25 : గ్రామ పంచాయతీలో రికార్డులను డీఎల్‌పీవో నరసింహారావు స్వాధీనం చేసుకున్నారు. భట్టిప్రోలు పంచాయతీ కార్యాలయంలో ఆదివారం రికార్డులను డీఎల్‌పీవో తనిఖీ చేశారు. 2019-20 సంవత్సరంలో గ్రామ పంచాయతీలో అవినీతి జరిగిందంటూ పంచాయితీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో డీఎల్‌పీవో కార్యాలయంలోని రికార్డులను స్వాధీనం చేసుకుని ఈవోపీఆర్‌డీకి అప్పగించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎల్‌పీవో పేర్కొన్నారు.


డీసీఎం వ్యాన్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు

● బస్సు క్లీనర్ మృతి

నల్గొండ, ఆగస్టు 25 : డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో బస్సులోని క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం ఆదివారం తెల్లవారుజామున నల్గొండ జిల్లా వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో గల నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మార్నింగ్ స్టార్ ప్రైవేట్ ట్రావెలింగ్ బస్సు రాత్రి 8 గంటలకు బాపట్ల నుంచి 27 మంది ప్రయాణికులు, డ్రైవర్ కేసాని మురళీకృష్ణ, క్లీనర్ దావాల దావీద్ (40)లతో హైదరాబాద్‌కు బయలుదేరింది. రాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో మండలంలోని శెట్టిపాలెం గ్రామశివారులోని మహర్షి మిల్లు సమీపంలో రోడ్డు పక్కన నిలిచి ఉన్న డీసీఎం వ్యాన్‌ను అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం, బస్సు మధ్యలో ఇరుక్కున్న బస్సు క్లీనర్ దావీద్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా ప్రయాణికులకు స్వల్పగాయాలైనట్లు తెలిపారు. అనంతరం మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఏఎస్‌ఐ నరసింహారావు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడు దావీద్ చిలకలూరిపేట వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటుండగా ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

బాపట్ల, ఆగస్టు 25 : ప్రతి సోమవారం పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడి ఓ ప్రకటనలో తెలిపారు.


స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్

మహిళల ఆర్థికాభివృద్ధికి సహకారం

● ప్రతి ఒక్కరినీ లక్షాధికారిగా చేయడమే లక్ష్యం
● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 25 : స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను లక్షాధికారులను చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. అందుకోసం లఖ్‌పతీ దీదీ పథకం ద్వారా వారికి అవసరమైన సహాయ సహకరాలు అందిస్తుందని చెప్పారు. మహారాష్ట్రలోని జల్‌గావ్‌లో ఆదివారం లఖ్‌పతీ దీదీ పథకాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో కలెక్టర్, స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి వీక్షించారు. అనంతరం లబ్ధిదారులతో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అన్సారియా మాట్లాడారు. జిల్లాలో 45,421 స్వయం సహాయక సంఘాల్లో 4,57,453 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. వీరిలో 7,109 మందిని వంద రోజుల్లోనే లక్షాధికారులుగా మార్చేలా యూనిట్ల స్థాపనకు కేంద్రం ఆర్థిక సహాయం చేస్తున్నదని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి లక్షాధికారులుగా మారే అవకాశం ఉన్న మరో 1,19,058 మందికి కూడా రుణాలు ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తొలివిడత లబ్ధిదారులుగా ఎంపిక చేసిన వారికి రూ.88.80 కోట్ల మేర రుణాలకు సంబంధించిన చెక్కులతోపాటు ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వసుంధర, డీపీఎంలు డేవిడ్, సుబ్బారావు, కృపారావు పాల్గొన్నారు.

ఆగి ఉన్న బైక్ నుంచి రూ.34 లక్షల చోరీ

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

మార్టూరు, ఆగస్టు 25 : మోటారు సైకిల్ పెట్రోలు ట్యాంకు కవర్లో ఉంచిన రూ.34లక్షల సొమ్మును ముగ్గురు ఆగంతుకులు అపహరించుకెళ్లారు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం మండల పరిధిలోని కోనంకి-ద్రోణాదుల మధ్య చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జె.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన తలారి ధనచక్రవర్తి వ్యవసాయం చేస్తూ మేకలను, గొర్రెలను మేపుతుంటారు. ఇటీవల ఆయన మిరప కాయలు అమ్మగా రూ.26లక్షలు వచ్చాయి. గేదెలను విక్రయించగా రూ.2లక్షలు, ఇతరత్రా మరో రూ.6లక్షల నగదు, కొంత బంగారం ఆయన వద్ద ఉంది. భార్య పుట్టిల్లు అయిన ద్రోణాదులలో ఉండటం, ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో నగదు, బంగారాన్ని అత్తవారింట్లో ఉంచాలని ధనచక్రవర్తి భావించారు. ఆదివారం రూ.34లక్షల నగదును బైక్ పెట్రోలు ట్యాంకుపైన కవర్లో పెట్టి, బంగారాన్ని జేబులో ఉంచుకొని ద్రోణాదులకు బయల్దేరారు. కోనంకి-ద్రోణాదుల మధ్య సాగర్ కాలువ వద్ద మోటార్ బైక్‌ను నిలిపి యూరినల్స్ కోసం కొద్ది దూరం వెళ్లారు. అంతలోనే బైక్‌పై అటుగా ముగ్గురు యువకులు వచ్చారు. అందులో ఒకరు దిగి ధనచక్రవర్తి బైక్‌కు ఉన్న తాళం చెవిని దూరంగా విసిరేశాడు. పెట్రోల్ ట్యాంకు కవర్‌లో ఉన్న రూ.34లక్షల డబ్బును తీసుకొని ముగ్గురూ పరారయ్యారు. ఈమేరకు బాధితుడు ధనచక్రవర్తి మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ శేషగిరిరావు తెలిపారు.

మార్కాపురం సబ్‌కలెక్టర్‌గా వెంకట త్రివినాగ్

● ఆయనకు ఇదే తొలిపోస్టింగ్



మార్కాపురం, ఆగస్టు 25 : మార్కాపురం సబ్ కలెక్టర్‌గా షెహదిత్ వెంకట త్రివినాగ్ నియమితులయ్యారు. ఆమేరకు ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు ఇచ్చింది. 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయనకు ఇదే తొలిపోస్టింగ్. త్రివినాగ్ హైదరాబాద్ ఐఐటీలో 2020లో బీటెక్ పూర్తి చేశారు. అనంతరం సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. విజయనగరంలో ట్రైనీ కలెక్టర్‌గా సేవలందించారు. ఉమ్మడి జిల్లాలోని కందుకూరు సబ్‌కలెక్టర్‌గా తిరుమణి శ్రీపూజ నియమితులయ్యారు. రాష్ట్రంలో మొత్తం ఎనిమిది మంది సబ్‌కలెక్టర్ల నియామకంలో భాగంగా వీరికి పోస్టింగ్‌లు ఇచ్చారు.


దేవస్థాన భూమిని చదునుచేసి ఏర్పాటుచేసిన ఫెన్సింగ్ రాళ్లు

దేవస్థాన భూమిలో అక్రమంగా ఫెన్సింగ్ రాళ్లు

» పోలీసు స్టేషన్‌లో ఈవో ఫిర్యాదు

పామూరు, ఆగస్టు 25: పామూరు శ్రీమదనవేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన భూమిలో ఆదివారం కొందరు అక్రమంగా ఫెన్సింగ్ వేశారు. పామూరుకు చెందినవీరు యంత్రాలతో హెచ్చరిక బోర్డును తొలగించి భూమిని చదునుచేసి చుట్టూ ఫెన్సింగ్ రాళ్లతో హద్దులు ఏర్పాటుచేశారు. ఈవిషయంపై దేవదాయ శాఖ ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు వరికుంటపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పామూరు దేవస్థానానికి చెందిన సర్వే నెంబర్ 76/1లో గల 6.06 సెంట్ల భూమి నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం వేంపాడు రెవెన్యూ పరిధిలో ఉంది. ఈభూమికి సంబంధించి ఆక్రమణదారులకు, దేవస్థానం మధ్య వివాదం ఉంది. ఇటీవల నెల్లూరు జిల్లా జేసీ రెవెన్యూ కోర్టులో ఇరువర్గాల వాదనలు అనంతరం ఈ భూమి దేవస్థానానికి సంబంధించినదిగా వెల్లడించారు. దాంతో ప్రయివేట్ వ్యక్తులు హైకోర్టును ఆశ్రయిచ్చి స్టే తీసుకొచ్చారు. తీర్పు వచ్చేవరకు ఇరువర్గాల వారు భూమిల్లోకి వెళ్లవద్దని స్టేలో పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ ప్రయివేట్ వ్యక్తులు ఆదివారం భూమిలోకి ప్రవేశించి యంత్రాలతో భూమిలో ఉన్న చెట్లను తొలగించి చదును చేసి ఫెన్సింగ్ వేశారంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఈవో తెలిపారు.

కంది పైరును దున్నేశారు

పీసీపల్లి, ఆగస్టు 25: తమ పొలంలో సాగుచేసిన కందిపైరును ధ్వంసం చేశారంటూ గుదేవారిపాలెంకు చెందిన ఇద్దరు రైతులు పీసీపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుదేవారిపాలెం పంచాయతీకి చెందిన గుదే సుబ్బారావు సర్వే నెంబరు 629, అదే గ్రామానికి చెందిన గుదే ఆదినారాయణ సర్వే నెంబరు 628/1లో గల తమ పొలాల్లో కంది పైరును సాగుచేశారు. అదే గ్రామానికి చెందిన గొర్లపాటి చినకోటేశ్వరరావు అనే వ్యక్తి తాము సాగుచేసిన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి డోజర్‌తో కందిపైరును ధ్వంసం చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీసీపల్లి పోలీసులు ధ్వంసమైన పొలాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం బాధిత రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ధ్వంసం చేసిన పొలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇసుక దొంగలను వదిలేశారా..?

20వేల టన్నులు అమ్ముకున్న వైసీపీ నేతలు
సచివాలయాలు, ఆర్బీకేల భవనాల నిర్మాణాలకు కేటాయించిన ప్రభుత్వం
పనుల ప్రారంభానికి ముందే దోపిడీ
రూ.2కోట్లకుపైగా సొమ్ము చేసుకున్న వైనం
మధ్యలో పనులు నిలిపేసిన కాంట్రాక్టర్లు
రెండేళ్ల క్రితమే ఉన్నతాధికారులకు ఫిర్యాదు
నేటికీ పట్టించుకోని వైనం

ఎర్రగొండపాలెం మండలంలోని అమానిగుడిపాడులో సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం 1,500 టన్నుల ఇసుకను కేటాయించింది. ఈ మొత్తాన్ని వైసీపీ నేతలు అమ్ముకున్నారు. దీంతో పనులు నిలిచిపోయాయి. త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో సైతం ఇలాగే ఇసుకను మెక్కేశారు.

పుల్లలచెరువు మండలంలోని కొమరోలు పంచాయతీకి సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలు మంజూరయ్యాయి. వీటి కోసం ప్రభుత్వం 546 టన్నుల ఇసుకను కేటాయించగా 300 టన్నులను వైసీపీ నేతలు పనుల ప్రారంభానికి ముందే 2020లోనే రీచ్‌ల నుంచి తీసుకొని పక్కదారి పట్టించారు. మండలంలోని 20 సచివాలయాలు, ఆర్బీకేల నిర్మాణాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.



పుల్లలచెరువు, ఆగస్టు 25 : ఎర్రగొండపాలెం నియోజవర్గంలో కోట్ల రూపాయల విలువైన ఇసుకను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి మంత్రి ఆదిమూలపు సురేష్ అనుచరుల దర్జాగా మెక్కేశారు. ఓ ప్రభుత్వ అధికారి, ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాలకు చెందిన ముగ్గురు నేతలు కుమ్మక్కై ఈ బాగోతాన్ని నడిపారు. నాటి ప్రభుత్వ హయాంలో సచివాలయాల నిర్మాణానికి అవసరమైన ఇసుక ఇండెంట్‌ల ద్వారా అక్రమంగా అనుమతి పొంది కోట్ల రూపాయలు దోచేశారు. ఈ విషయం అధికారులకు తెలిసినప్పటికీ అప్పట్లో రాజకీయ ఒత్తిళ్లతో మిన్నకుండిపోయారు.

> వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎర్రగొండ పాలెం నియోజకవర్గంలో ఆ పార్టీ నేతల దోపిడీ యథేచ్ఛగా కొనసాగింది. అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ వారు ఆదాయమార్గంగా మార్చుకున్నారు. అందినకాడికి దండుకున్నారు. చివరికి సచివాలయాల నిర్మాణాలకు అవసరమైన ఇసుకకు సంబంధించి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఇచ్చిన వెసులుబాటును వినియోగించుకొని కాసులు కూడబెట్టుకున్నారు. వారి ప్రమేయం లేకుండానే పనులు ప్రారంభానికి ముందే ఇసుకను రీచ్‌ల నుంచి తీసుకొచ్చి పక్కదారి పట్టించారు. 20 వేల టన్నుల మేర అమ్ముకొని రూ.2కోట్ల వరకూ లబ్ధిపొందారు. ఒప్పందానికి అనుగుణంగా ఆమొత్తం ఇసుకకు సంబంధించిన సొమ్మును ప్రభుత్వం బిల్లుల్లో తగ్గించుకోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో అత్యధిక గ్రామాల్లో సచివాలయ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. వైసీపీ నేతల ఇసుక మేతపై కొందరు కాంట్రాక్టర్లు రెండేళ్ల క్రితమే ఉన్నతాకారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు కరువయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అధికారులు వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాంట్రాక్టర్లకు ఇచ్చిన వెసులుబాటు వైసీపీ నేతలకు వరం

గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది. గ్రామాల్లో సచివాలయ కాంప్లెక్స్‌ల నిర్మాణాన్ని చేపట్టింది. అప్పట్లో ఇసుక కొరత ఉండటంతో దాన్ని అధిగమించేందుకు సచివాలయం, ఆర్బీకే, ఆరోగ్యకేంద్ర భవనాల నిర్మాణాలు పొందిన కాంట్రాక్టర్లు ఇండెంట్ ద్వారా రీచ్‌లను ఎటువంటి సొమ్ము చెల్లించకుండా తెచ్చుకునే వెసులుబాటు కల్పించింది. అయితే అందుకు ప్రభుత్వమే టన్నుకు రూ.375 చొప్పున చెల్లించి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించే సమయంలో ఇసుక వినియోగాన్ని బట్టి ఆ మొత్తాన్ని తగ్గించి ఇవ్వాలని నిర్ణయించింది. ఇక్కడే తిరకాసు వచ్చి పడింది. కాంట్రాక్టర్లకు సంబంధం లేకుండా వైసీపీ నేతలు ఇండెంట్లు తీసుకొని ఇసుకను అమ్ముకొన్నారు.

పంచాయతీ రాజ్ సంపూర్ణ సహకారం

పంచాయతీ రాజ్‌లో పనిచేసే అధికారి కూడా వైసీపీ నేతలతో కుమ్మక్కవడంతో ఆ శాఖ నుంచి ఇండెంట్‌లు తీసుకొని వెళ్లి రీచ్‌లలో నుంచి ఇసుకను తెచ్చి అమ్ముకున్నారు. పంచాయతీరాజ్ విభాగంలో పనిచేసే ఓ అధికారి, ఎర్రగొండపాలెంనకు చెందిన మాజీ ప్రజాప్రతినిధి కుమారుడు, పుల్లలచెరువు మండల నాయకుడు, త్రిపురాంతకం మండలానికి చెందిన ఓ నాయకుడు ఈ ఇండెంట్లు పొందారు. వీటి ద్వారా ఇష్టానుసారం ఇసుక విక్రయాలు చేపట్టారు. దాదాపు రూ.80 లక్షల విలువైన 20 వేల టన్నుల ఇసుకను ఈ ఇండెంట్‌ల ద్వారా పొంది పక్కదారి పట్టించారు. ఈ మొత్తం ఇసుక మార్కెట్ విలువ రూ.2 కోట్లు ఉంటుందని అంచనా. రూపాయి కూడా ఖర్చు చేయకుండానే అప్పనంగా ఇసుకను అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. రికార్డుల్లో సచివాలయ భవనాల కోసం ఇసుక వినియోగించినట్లు చూపారు.

45వేల టన్నుల కేటాయింపు.. 20వేల టన్నులు పక్కదారి

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఐదు మండలాల్లో సచివాలయ కాంప్లెక్స్‌ల కోసం ప్రభుత్వం సుమారు 45 వేల టన్నులకు పైగా ఇసుకను కేటాయించింది. పుల్లలచెరువుకు 9,578 టన్నులు, త్రిపురాంతకం 13,010, ఎర్రగొండపాలెం 14,464, పెద్దారవీడు 7,203, దోర్నాల 8,906 టన్నుల చొప్పున ఇండెంట్‌ను పంచాయతీరాజ్ అధికారులు జనరేట్ చేశారు. ఆ మేరకు 2020లోనే ఇసుక ఇండెంట్‌లను ఇవ్వగా ఎక్కువ శాతం సచివాలయాల పనులు 2021లో ప్రారంభమయ్యాయి. అయితే ఇప్పటికే ఇసుక ఖర్చు చేసినట్లు ప్రభుత్వ లెక్కలో చూపడంతో ఆమేరకు సచివాలయాలు నిర్మిస్తున్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులో కోత విధించింది. మొత్తం మీద రూ.80 లక్షలు కోత పెట్టింది. ఆమేరకు బిల్లులు తగ్గడంతో ఈ సచివాలయ భవనాల నిర్మిస్తున్న కాంట్రాక్టర్లు కూడా కాడి కిందేశారు. మొత్తం 20వేల టన్నుల ఇసుకను వైసీపీ నేతలు మెక్కేశారు.

పట్టించుకోని అధికారులు

ఇసుక అక్రమ తరలింపు, విక్రయాలపై 2022 నవంబరు 21న జరిగిన స్పందనలో ఐదు మండలాల్లోని 15 మందికిపైగా కాంట్రాక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అప్పటి కలెక్టర్‌ను కలిసి అర్జీలు అందజేశారు. దీంతో ఆయన పీఆర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి పీఆర్ జిల్లా ఎస్ఈ కొండయ్య మాట్లాడుతూ ఇప్పటికే ఎర్రగొండపాలెంలో జరిగిన ఇసుక అక్రమాలు విజిలెన్స్ అధికారుల దృష్టికి వెళ్లిందని తెలిపారు. కేసు పెట్టేందుకు అధికారులు సిపార్సు చేసినా, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని తెలిపారు. పది రోజుల్లో అక్రమార్కులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అలా చెప్పి రెండేళ్లు గడిచినా నేటికీ కేసు నమోదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన టీడీపీ ఇన్‌చార్జి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో తక్షణమే అక్రమార్కులపై కేసు నమోదు చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. అయితే పంచాయతీరాజ్ అధికారులు మాత్రం ఇవేమీ తమకు పట్టవన్నట్లు మిన్నకుండిపోయారు. ఇప్పటికీ అధికారులు వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై ఎర్రగొండపాలెం పీఆర్ డీఈ సుబ్బారెడ్డిని వివరణ కోరగా ఈ ఘటనపై ప్రైవేటు వ్యక్తులపై కేసులు పెట్టమని తనకు ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. ఉన్నతాధికారులే దీనిపై ఫిర్యాదు చేస్తారన్నారు.

నిబద్ధతతో ఎదిగిన డేవిడ్‌రాజు

దళితనేతగా టీడీపీలో మంచి గుర్తింపు
అనారోగ్యంతో కన్నుమూత
పలువురు ప్రముఖుల సంతాపం
నేడు మట్టిగుంటలో అంత్యక్రియలు



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దళితవర్గం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే డేవిడ్ రాజు నిబద్ధతతో అంచెలంచెలుగా ఎదిగారు. వివిధ పదవుల్లో పనిచేసిన ఆయన ప్రజానేతగా గుర్తింపు పొందారు. ఆయన మృతి రాజకీయవర్గాలతోపాటు వివిధ రంగాల వారిని కలచివేసింది. కొద్ది సంవత్సరాల నుంచి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న డేవిడ్‌రాజు హైదరాబాద్‌లోని ఒక వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలో దళితవర్గం నుంచి వచ్చి మండలం నుంచి జిల్లాస్థాయి వరకూ పలు ముఖ్యపదవులు పోషించిన నేతగా డేవిడ్‌రాజు గుర్తింపు పొందారు. నాగులుప్పలపాడు మండలం మట్టిగుంటకు చెందిన ఆయన యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తయిన వెంటనే అప్పుడే ఏర్పడిన తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీలో ఉన్నంతకాలం పార్టీ పట్ల నిబద్ధత, ముఖ్య నాయకులతో సమన్వయంగా నడుస్తూ కార్యకర్తలతో బలమైన సంబంధాలు ఏర్పరచుకున్నారు. ఉన్నత విద్యనభ్యసించడం కూడా ఆయనకు కలిసొచ్చింది. మండల వ్యవస్థ ఏర్పడిన తొలి దశలోనే ఆయన టీడీపీ నుంచి నాగులుప్పలపాడు మండల అధ్యక్షుడు అయ్యారు. 1994లో ఎమ్మెల్యే టికెట్ ఆశించి అది దక్కక నిరాశపడిన డేవిడ్‌రాజు పార్టీని వీడకపోవడం కలిసొచ్చింది. ఆతర్వాత నాగులుప్పలపాడు మండలం నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొంది జడ్పీచైర్మన్ అయ్యారు. జిల్లా పరిషత్ దళితులకు రిజర్వు కావడంతో టీడీపీ మరో ఆలోచన చేయకుండా డేవిడ్‌రాజుకు అవకాశం ఇచ్చింది. అప్పట్లో పార్టీ బాధ్యతలు మోస్తున్న డాక్టర్ దగ్గుబాటి నిర్ణయం ఆయనకు కలిసొచ్చింది. ఆతర్వాత సంతనూతలపాడు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1984 నుంచి 2012 వరకూ టీడీపీలో ఉండి వివిధ పదవులతోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి నాయకుల మన్ననలు పొందారు. ఆ పార్టీ కార్యకర్తలకు బాగా చేరువయ్యారు. 2014 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరి ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ఆపార్టీలో ఇమడలేకపోయారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే టీడీపీలో చేరినా పూర్వకాలపు శ్రేణుల మద్దతు పొందలేకపోయారు. ఆతర్వాత ఆయన పెద్దగా పదవులను ఆశించకపోయినా తన కుమారుడిని వారసుడిగా నిలబెట్టేందుకు విశ్వప్రయత్నం చేశారు. టీడీపీలో అవకాశం రాకపోవడంతో కాంగ్రెస్‌లో చేరి కుమారుడిని గత ఎన్నికల్లో పోటీ చేయించి ప్రస్తుతం అదేపార్టీలో కొనసాగుతున్నారు. చివరిరోజుల్లో రాజకీయ మార్పులు ఎలా ఉన్నా జిల్లాలో దళితవర్గం నుంచి రాజకీయాల్లోకి వచ్చి మండలం నుంచి జిల్లాస్థాయికి ఎదిగి ఆయా స్థాయిల్లో పదవులు నిర్వహించిన ప్రజానేతగా డేవిడ్‌రాజుకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రజా సంబంధాలు అధికం కావడంతో ఆయన మృతికి రాజకీయాలకతీతంగా పలువురు నాయకులు, ఆయా ప్రాంతాల్లోని కిందిస్థాయి ప్రజలు నివాళులర్పించారు. డేవిడ్ రాజు భౌతికకాయాన్ని సోమవారం ఉదయం ఒంగోలులోని క్లౌపేటలోని ఆయన నివాసానికి తీసుకురానున్నారు. అక్కడ వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు సందర్శనార్థం ఉంచుతారు. అనంతరం నాగులుప్పలపాడు మండలం మట్టిగుంటలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రశ్నపత్రం లీకైతే క్రిమినల్ చర్యలు

● రేపటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు ప్రారంభం

ఒంగోలు (విద్య), ఆగస్టు 25 : పాఠశాలల్లో 1నుంచి10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ) మోడల్ పేపర్-1 పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ప్రశ్నపత్రాలు లీకైతే సంబంధిత అధికారులపై క్రిమినల్ చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించింది. ప్రశ్నపత్రాలను ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలలకు డీసీఈబీ ద్వారా సరఫరా చేస్తారు. ప్రైవేటు స్కూళ్లకు అక్కడి టీచర్లు తయారుచేసి పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. పరీక్షల పర్యవేక్షణ, ఎమ్మార్సీల నుంచి పాఠశాలలకు ప్రశ్నపత్రాల పంపిణీకి మండల స్థాయిలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. అందులో ఎంఈవో-1, ఎంఈవో-2, ఒక సీనియర్ హెచ్ఎం ఉన్నారు. ఉదయం, మధ్యాహ్నం పరీక్ష ప్రారంభానికి గంట ముందు మాత్రమే పాఠశాలలకు ప్రశ్నపత్రాలు ఇవ్వనున్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో దొంగలు హల్‌చల్

వరుసగా మూడు ఇళ్లలో చోరీలు
సుమారు రూ.10 లక్షల సొత్తు అపహరణ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, ఇళ్లలో వస్తువులను చిందరవందరగా పడేసిన దుండగులు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 25: ఒంగోలు నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలో దొంగలు శనివారం రాత్రి హల్‌చల్ చేశారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఏకంగా మూడిళ్లలో చొరబడి తాళాలు పగులగొట్టి సుమారు రూ.10 లక్షలు సొత్తును దోచుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. ఓ ప్రైవేటు కంపెనీలో వాచ్‌మెన్‌గా పనిచేసే ఆత్మకూరి శ్రీను ఇంట్లో తాళం పగులకొట్టి సుమారు రూ.6లక్షల విలువైన సొత్తును దోచుకెళ్లారు. శ్రీను కుటుంబసభ్యులతో కలిసి శనివారం సాయంత్రం తన కుమారుడు ఉంటున్న విజయవాడకు వెళ్లారు. తిరిగి ఆదివారం సాయంత్రం వచ్చేసరికి ఇంటి తలుపులు పగులకొట్టి దుండగులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. అదే విధంగా క్విస్ కళాశాలలో పనిచేస్తున్న సోమేపల్లి హర్షవర్ధన్ ఇంట్లో దొంగలు పడ్డారు. అయితే అక్కడ రోల్డుగోల్డు ఆభరణాలు అపహరించుకు వెళ్లారు. ఇక మహమ్మద్ షరీఫ్ ఇటీవల 20 రోజుల క్రితం మృతి చెందారు. దీంతో అక్కడ ఆ ఇంటికి తాళం వేసిన కుటుంబసభ్యులు వేరే చోట ఉంటున్నారు. అయితే ఆ ఇంటి తాళం పగలకొట్టి బంగారం బ్రాస్‌లెట్, చైన్, అర కిలో వెండి చోరీ చేశారు. దీంతో వరుసగా తమ ఇళ్లకు వచ్చిన వారు చూసి చోరీలు జరిగిన విషయం చూసి గుండెలు ఆదిరేలా బాదుకున్నారు. ఈ మేరకు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ అజయ్‌కుమార్ సంఘటనా స్థలాలను పరిశీలించి కేసులు నమోదు చేశారు. అలాగే సంఘటనా స్థలాల్లో కీలకమైన ఆధారాలను సేకరించే పనిలో వేలిముద్రల నిపుణులు ఉన్నారు.

మరో ఇద్దరి మృతదేహాలు లభ్యం

దర్శి, ఆగస్టు 25: సాగర్ కాలువలో ఆదివారం మరో ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ముగ్గురు విద్యార్థులు శనివారం ఈతకు వెళ్లి కాలువలో గల్లంతైన విషయం తెలిసిందే. అందులో కొత్తపల్లికి చెందిన పోతిరెడ్డి లోకేష్‌రెడ్డి మృతదేహం శనివారమే లభ్యమైంది. మరో ఇద్దరు బత్తుల మణికంఠారెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. గజ ఈతగాళ్లు, అధికారులు పడవల ద్వారా సాగర్ కాలువలో వెతుకుతుండగా మధ్యాహ్నం మణికంఠారెడ్డి మృతదేహం నీటిలో తేలుతూ కనిపించింది. సాయంత్రం కుందూరు కిరణ్‌కుమార్ రెడ్డి మృత దేహం లభ్యమైంది.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


సాగర్ కాలువలో నీటిలో తేలుతున్న మణికంఠారెడ్డి మృతదేహం

సాగర్ కాలువలో ఈతకు వెళ్లి మృతిచెందిన విద్యార్థుల మృతదేహాలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదివారం నివాళులర్పించారు. దురదృష్టకర సంఘటన పట్ల ఆమె దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అలాగే, సీపీఎం నాయకులు టి.రంగారావు, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు.

మంచంపట్టిన పల్లెలు!

- టైఫాయిడ్, వైరల్ ఫీవర్‌తో ప్రజల బెంబేలు
- జ్వరపీడితులతో కిక్కిరిస్తున్న ఆసుపత్రులు
- కలుషిత నీరు, అపరిశుభ్రతే కారణమంటున్న వైద్యులు



పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న రోగులు



ఇందిరా కాలనీలో పారిశుధ్య చర్యలు లేక ఇలా

పర్చూరు, అగస్టు 25 : పల్లెలు మంచం పట్టాయి. వైరల్, టైఫాయిడ్, విష జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఏ గ్రామంలో చూసినా ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వర బాధితులు ఉండడం తీవ్రతను తెలియజేస్తోంది. జ్వరాలు విజృంభిస్తుండడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో నిండిపోతున్నాయి. సీజనల్‌గా వస్తున్న జ్వరాల ప్రభావ తీవ్రత ఒకింత ప్రజలను కలవరానికి గురిచేస్తుంది. జ్వరపీడితుల్లో అధికభాగం వైరల్ ఫీవర్, టైఫాయిడ్ వారే ఉన్నారు. గతంలో ఆయా కాలనీల్లో డెంగ్యూ కేసులు కూడా నమోదు అయ్యాయి. ఆ సమయంలో పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి జ్వరాలు తగ్గకపోవడం అది సాధారణ జ్వరమా వైరల్ ఫీవర్ అని రోగులు భయపడుతున్నారు. వారపది రోజులుగా జ్వర పీడితుల సంఖ్య పెరుగుతున్నట్లు వైద్యులు చెప్తున్నారు. పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రిలో (సీహెచ్‌సీ) రోజుకు వంద నుంచి 130 ఓపీలు నమోదు అవుతుండగా వారిలో సగం మంది జ్వరాలతో వచ్చిన వారే ఉంటున్నారు.

పారిశుధ్యం అధ్వానం

గ్రామాల్లో ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా మారింది. అనేక చోట్ల మురుగునీరు ముందుకు కదలడం లేదు. దీంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారి కంటిమీద కునుకు లేకుండా పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమ కాటు వల్ల జ్వరాల బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. కనీసం మురుగు కాలువల్లో ఎబేట్ ద్రావణం కానీ, బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవని ప్రజలు అంటున్నారు. మరోపక్క గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేటికీ కాలనీల సందర్శనంకకు కూడా రాలేదని అంటున్నారు.

కలుషిత నీరు

కలుషిత తాగునీటి సమస్య ప్రజలను వేధిస్తోంది. ఏ గ్రామంలో చూసినా మంచినీటి చెరువులు కలుషిత నీటితో దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు ఫిల్టర్ బెడ్‌లు పనిచేయక పోవడం కనీసం నీటిలో బ్లీచింగ్ కోసం వినియోగించకుండా అపరిశుభ్రంగా ఉన్న నీటిని నేరుగా పంచాయతీ కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. చేసేది లేక ఆ నీటినే ఉపయోగిస్తున్నామని ప్రజలు చెప్తున్నారు. కలుషిత నీరు, అపారిశుధ్యంవల్లే రోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ, ఆర్థిక సంఘ నిధులతో పారిశుధ్య పనులు, క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

రోగులతో కిక్కిరిస్తున్న ప్రయివేట్ వైద్యశాలలు

విష జ్వరాలు విస్తరిస్తుండడంతో ఎక్కడ చూసినా ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో నిండిపోతున్నాయి. సాధారణ జ్వరమో, విష జ్వరమో అర్థంకాని పరిస్థితి నెలకుంది. రోజుల తరబడి ఆసుపత్రుల చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి ఉంది. కొందరు టెస్టుల పేరుతో రోగులను పీల్చిపిప్పి చేస్తున్నారు.

పారిశుధ్యం, కలుషిత నీరే కారణం

పారిశుధ్యం లోపం, కలుషిత నీటిని తాగటం వల్లే ప్రజలు ఇలా రోగాలబారిన పడుతున్నారు. ప్రస్తుతం జ్వర బాధితులు అధికంగా ఉన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఇంటి చుట్టూ, పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా, చెత్తచెదారాలు లేకుండా శుభ్రం చేసుకోవాలి.

- డాక్టర్ సిద్ధార్థ



అవధానులను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

తెలుగు సారస్వతానికి వైభవం అందించిన కొప్పరపు కవులు

అద్దంకిటౌన్, ఆగస్టు 25 : తెలుగువారికే చెందిన అవధాన కళకు, పద్య విద్యకు దిట్టమైన పట్టుకొమ్మలుగా నిలిచి, తెలుగు సారస్వతానికి వైభవం అందించారని కొప్పరపు కవుల ఘనతను ప్రముఖ కవి డీవీఎం సత్యనారాయణ కీర్తించారు. ఆదివారం అద్దంకిలోని చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యంచే రెండవరోజు శతావధానం జరిగింది. పృచ్ఛకులు అడిగిన శతావధానానికి సంబంధించిన సమస్య, దత్తపది, వర్ణన, ఆశువులకు, చమత్కార భరితంగా, మంచి ధారణతో రసవత్తరంగా శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం పూరించారు. అనంతరం పృచ్ఛకవులను ట్రస్టు తరుపున పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ సాహితి సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

డేవిడ్‌రాజు మృతికి మంత్రి గొట్టిపాటి సంతాపం

అద్దంకి, ఆగస్టు 25 : మాజీ ఎమ్మెల్యే, మాజీ జడ్పీ చైర్మన్ పాలపర్తి డేవిడ్ రాజు మృతి పట్ల విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రగాఢ సంతాపం తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ గా, సంతనూతలపాడు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల ఎమ్మెల్యేగా అభివృద్ధి కోసం డేవిడ్‌రాజు కృషి చేశారని రవికుమార్ గుర్తు చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



శాఖాహారంపై ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

పర్చూరు, ఆగస్టు 25 : మాంసాహారాన్ని వీడి శాఖాహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా జీవించవచ్చని పిరమిడ్ ధ్యాన మందిర నిర్వాహకుడు లగడపాటి అంకమ్మ గాంధీ అన్నారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పర్చూరులో శాఖాహారంపై ర్యాలీ నిర్వహించారు. మాంసాహారం వద్దని శాఖహారం తీసుకోవవాని పెద్ద ఎత్తున ప్లకార్డులు చేత పట్టి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పెద్దనందిపాడు రాంబాబు, కృష్ణంశెట్టి రమాదేవి, కాకుమాను రాంబాబు, పాబోలు నారాయణ, బిఎల్ శర్మ, శేఖర్ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

బొడ్డురాయికి పూజలు

మార్టూరు, ఆగస్టు 25 : మార్టూరు గ్రామంలో బొడ్డురాయికి ఆర్య వైశ్య మహిళలు ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. చీరతో అలంకరించి పసుపు, కుంకుమతో పూజలు చేశారు. అనంతరం అందరూ కొబ్బరికాయలు కొట్టి ప్రదక్షిణాలు చేశారు. శ్రావణ మాసంలో గ్రామ దేవతలను పూజించడం,ఆరాదించడం ద్వారా ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని నమ్మకం. అందులోభాగంగా ఆర్యవైశ్య మహిళలు బొడ్డురాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కొందరు మహిళలు ప్రత్యేక వస్త్రధారణతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

టీడీపీ కార్యాలయాన్ని సందర్శించిన సినీ నటుడు అశోక్‌బాబు



టీడీపీ కార్యాలయాన్ని సందర్శిస్తున్న సినీ నటుడు, నిర్మాత అశోక్‌బాబు

కారంచేడు(పర్చూరు), అగస్టు 25: కారంచేడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆదివారం సినీ నటుడు, నిర్మాత కొల్లా అశోక్‌బాబు సందర్శించారు. కార్యాలయానికి చేరుకున్న ఆయన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. నూతనంగా రూపుదిద్దుకున్న పార్టీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం స్థానికులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి అభివృద్ధిని సాధించాలని కోరారు.

నేడు భరతనాట్య ప్రదర్శన

పర్చూరు, ఆగస్టు 25 : శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా పర్చూరులోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో కూచిపూడి భరతనాట్య ప్రదర్శన పోటీలు నిర్వహిచనున్నట్లు ఆలయ కార్య నిర్వాహక కార్యదర్శి కోటిరెడ్డి, దేవస్థాన చైర్మన్ రావు వారి వెంకట శివప్రసాద్ ఆదివారం ప్రకటలో తెలిపారు. పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అమ్మవారి చీరల వేలం పాట



అమ్మవారి చీరల వేలంపాటలో పాల్గొన్న మహిళలు

పర్చూరు, ఆగస్టు 25 : పర్చూరు గ్రామ దేవత శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలకు దేవదాయ శాఖ అధ్వర్యంలో ఆదివారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారి చీరలను దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక అధికారి కోటిరెడ్డి, పెద్ద కాపు, ఆలయ వంశ పారంపర్య అర్చకులు తులసి చంద్రయ్య, తులసి భిక్షాలు, మహిళలు పాల్గొన్నారు.

నిరుపేదలను లక్షాధికారులను చేస్తాం



మహిళలను సన్మానిస్తున్న వెలుగు ఏపీఎం సురేంద్రబాబు

బల్లికురవ, ఆగస్టు 25 : లఖ్ పతి దీదీ కార్యక్రమంలో భాగంగా 100 రోజుల్లో పొదుపు సంఘాలలో ఉన్న నిరుపేద మహిళలను లక్షాధికారులను చేస్తామని వెలుగు ఏపీఎం సురేంద్రబాబు తెలిపారు. ఆదివారం వెలుగు కార్యాలయంలో ఆయిదుగురు మహిళను సత్కరించి వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతి మహిళను లక్షాధికారులను చేసేందుకు ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నారని బల్లికురవ మండలంలో 190 మంది మహిళలను గుర్తించి వారిని లక్షాదికార్లను చేసేందుకు ప్రణాళిక రుపోందించామని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందిరి అంజిబాబు, సీసీలు విజయ రాణి, పేరయ్య, అద్యక్షురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : మహిళలకు లక్షాధికారులు కావడానికి ఉన్న అవకాశాలను తెలియజేసి సుస్థిరమైన జీవనోపాధి కోసం అవసరమైన ఆర్థిక తోడ్పాటు రుణాల అందించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ లైవ్ ప్రోగ్రాం ద్వారా తెలియజేయడం జరిగిందని వెలుగు ఏపీఎం కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక వెలుగు కార్యాలయంలో లఖ్ పతి దీదీ లైవ్ కార్యక్రమం ద్వారా ప్రధాని మాట్లాడారు. సంవత్సరానికి కుటుంబ ఆదాయం లక్ష లోపు ఉన్న వారిని గుర్తించి వారికి ఆర్థిక తోడ్పాటు, సాంకేతిక సహకారం, శిక్షణ అందించి వారికి లక్షకు పైగా ఆదాయం వచ్చేలా చేయడమే పథకం లక్ష్యమని తెలిపారు. అనంతరం పనిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీవోఏలను, ప్రొటెన్షియల్ లఖ్ పతి దీదీలను ఏపీఎం కోటేశ్వరరావు, సీసీలు సర్టిఫికెట్‌లను అందజేసి సన్మానించారు. సీఐఎఫ్, స్త్రీనిధి, బ్యాంక్ రుణాలకు సంబంధించి రూ.86.50లక్షల చెక్కును వీవోఏలకు పంపిణీ చేశారు.



ప్రతిభ చూపిన వీవోఏలను సన్మానిస్తున్న ఏపీఎం కోటేశ్వరరావు

మేదరమెట్ల : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వాల లక్ష్యమని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. ఆదివారం వెలుగు కార్యాలయంలో లఖ్ పతి దీదీ లైవ్ ప్రోగ్రాం చూడడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 3 కోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా మార్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. యూనిట్లను ఏర్పాటు చేయించి వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా రుణాలు పొంది యూనిట్‌లు నడుపుతున్న 5గురిని సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు తుళ్లూరి వెంకట రమణ, ఏపీఎం అనూరాధ, సీసీలు, వీవోఏల సంఘం కార్యదర్శి మారుతి, కోశాధికారి సుబ్బాయమ్మ, చాట్లా జాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వీర్ల గంగమ్మ

వీర్ల గంగమ్మకు ప్రత్యేక పూజలు

బల్లికురవ, ఆగస్టు 25 : శ్రావణ మాసం ఆదివారం సందర్భంగా వీర్ల గంగమ్మ దేవాలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంతో ప్రసిద్ధి చెందిన గంగమ్మ దేవాలయానికి పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పూజలు చేశారు. ఈసందర్భంగా అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. గంగమ్మ దేవాలయం నలువైపులా ఉన్న గ్రానైట్ క్వారీల యజమానులు, కార్మికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ట్రాలీ ఆటో బోల్తా

అద్దంకి, ఆగస్టు 25 : టైరు పేలడంతో ఆటో బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తిమ్మాయపాలెం సమీపంలో దర్శి నుంచి గుంటూరుకు చిక్కుడుకాయల బస్తాలతో వెళ్తున్న ఆటో ఆదివారం సా యంత్రం టైరు పగిలిపోవడంతో రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయి బోల్తా ప డింది. దీంతో బస్తాలు చిందబందరగా పడ్డాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.



బోల్తా పడిన ఆటో



రామకోటేశ్వరరావును అభినందిస్తున్న ఆర్యవైశ్య నేత గార్లపాటి

కన్యకాపరమేశ్వరి దేవస్థాన అధ్యక్షునిగా ఊటుకూరి ఏకగ్రీవం

అద్దంకి, ఆగస్టు 25 : అద్దంకి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, కల్యాణ మండపం అధ్యక్షునిగా ఊటుకూరి రామ కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యుల సర్వసభ్య సమావేశం ఆదివారం వాసవీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సమావేశంలో రామకోటేశ్వరరావును ఎన్నుకున్నారు. ఆయన 5 సంవత్సరాల పాటు పదవీకాలంలో కొనసాగనున్నారు. ఇప్పటి వరకు రెండు విడతలు కోట శ్రీనివాసకుమార్ 10 సంవత్సరాల పాటు అధ్యక్షునిగా ఉన్నారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరరావును ఆర్యవైశ్య నేతలు కోట శ్రీనివాసకుమార్, చిన్ని శ్రీనివాసరావు, గార్లపాటి శ్రీనివాసరావు, బోజన పల్లి సత్యనారాయణ, చుండూరి మురళీసుధాకర్, చిన్ని శ్రీమన్నారాయణ, మురళీకృష్ణ, వీరయ్య, పీఏఎస్ కోటేశ్వరరావు, గోపు శ్రీనివాసరావు అభినందించారు.

మణికేశ్వరంలో సిమెంట్ బల్లల ఏర్పాటు



సిమెంట్ బల్లలు

అద్దంకి, ఆగస్టు 25 : మండలంలోని మణికేశ్వరంలో టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆదివారం రెండు సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. ప్రధాన కూడలిలో గ్రామస్థులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేసినట్లు కరిముల్లా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

పంగులూరు, ఆగస్టు 25 : మండలంలోని రేణంగివరం, అద్దంకి రహదారిలో కశ్యాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అలవలపాడు గ్రామానికి చెందిన యువకుడు షేక్ బడే సాహెబ్ (28) మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి 12 గంటల సమయంలో జరిగింది. అలవలపాడు గ్రామానికి చెందిన షేక్ బడే సాహెబ్ ఆదివారం తెల్లవారుజామున పత్తికొనుగోలుకు ఫోర్ వీలర్‌పై అద్దంకి నుంచి దర్శి ప్రాంతానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై అలవలపాడు నుంచి బయలుదేరాడు. కశ్యాపురంలోని అన్నదాత కోల్డ్ స్టోరేజీ సమీపంలో కట్టెల లోడ్‌తో ముందు వెళుతున్న లారీని క్రాస్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ బి. వినోద్‌బాబు పరిశీలించారు. బడే సాహెబ్ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం అతిగా సేవించి వ్యక్తి మృతి



సుబ్బారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్

చినగంజాం, ఆగస్టు 25 : మద్యం సేవించి వ్యక్తి మృతి చెందిన సంఘటన చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని చుండిబజారులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపిన వివరాలివి. చుండిబజారుకు చెందిన నిడుబ్రోలు సుబ్బారావు (43) 15 ఏళ్ల కిందట కుటుంబసభ్యులతో కలిసి నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేటకు వెళ్లారు. అక్కడ టైలరింగ్ చేసుకుంటూ జీవిస్తున్నారు. అప్పులు కావడంతో మనస్థాపం చెంది 15 రోజుల కిందట సుబ్బారావు ఒక్కడే చినగంజాం గ్రామానికి వచ్చారు. రోజూ మద్యం సేవించి తిరుగుతూ ఆదివారం ఉదయం సుబ్బారావు మృతి చెందినట్లు సుబ్బారావు అన్న కూమారుడు గుర్తించారు. అతని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అతనికి ఇద్దరు కుమారులున్నారు.

సీసీ రోడ్లపై మురుగు నీరు



అద్దంకి మాన్యంలో రోడ్డుపై ఉన్న మురుగు

పర్చూరు, అగస్టు 24 : పర్చూరులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కాలువల్లో మురుగు ముందుకు కదులుతున్న దాఖలాలు లేవు. దీంతో డ్రైనేజీ కాలువల్లోని మురుగును తొలగించాలంటే పారిశుధ్య కార్మికులకు నరక ప్రాయంగా మారింది. దీంతో మురుగు ముందుకు కదలక కొద్దిపాటి వానకే రోడ్లపైకి చే రుతుంది. నెలలతరబడి రోడ్లపై నిలిచి ఉండడంతో రాకపోకలకు కాలనీల వాసులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పర్చూరులోని అద్దంకి మాన్యంలో సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు దృష్టి సారించి రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండకుండా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

వైట్‌బర్లీ పొగాకు నారుమడుల పెంపకంపై ఆసక్తి

పలు గ్రామాలలో సాగు చేస్తున్న రైతులు



మల్లాయపాలెంలో పొగాకు మడులలో కలుపు తీస్తున్న కూలీలు



వైట్‌బర్లీ నారు మడులు

బల్లికురవ, ఆగస్టు 25 : గత ఏడాది వైట్ బర్లీ పొగాకు నారుకు మంచి డిమాండ్ వచ్చి అధిక ధరలు పలికి లాభాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది మరింత మంది రైతులు పొగాకు నారు పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. పలు గ్రామాల్లో రైతులు నాలుగు నెలల వ్యవధిలోనే పలు విడతలుగా పొగాకు నారు మడులు పెంపకాన్ని చేపట్టేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. కొందరు రైతులు అయితే నీటి వసతి ఉన్న భూములను కౌలుకు తీసుకొని వైట్ బర్లీ నారు పెంపకం చేపడుతున్నారు. పొగాకు సాగు కూడా ఈ ఏడాది అధికం అవుతుందని పలువురు రైతులు అంటున్నారు.

మండలంలోని వేమవరం, గంగపాలెం, కొనిదెన, మల్లాయపాలెం, కొప్పెరపాలెం, నక్కబొక్కలపాడు, బల్లికురవ గ్రామాలలో రైతులు గత పది హేను రోజుల నుంచి సుమారు 20 ఎకరాల్లో పొగ నారుమడులు పెంపకం చేపట్టారు. ఎకరం పొగాకు మొక్కలు మూడు వందల ఎకరాలకు సరిపడతాయని రైతులు చెప్తున్నారు. ఎకరాకు 9 వేల మొక్కలు వరకు నాటుతారని గత ఏడాది కూడా ఆరు వేల పొగాకు మొక్కల మూట 12 వేల వరకు అమ్మకాలు జరిగాయని, పెట్టుబడి పోను ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వచ్చిందని రైతులు తెలిపారు. ఈ ఏడాది కూడా అలానే అమ్మకాలు ఉంటాయనే ఆశతో పొగ నారు మడులు సాగు చేస్తున్నామని రైతులు తెలిపారు. కొందరు రైతులు నీటి వసతి తక్కువగా ఉన్న డ్రిప్ పద్ధతిన పొగ నారు మడుల పెంపకం చేస్తున్నారు. వైట్ బర్లీ పొగాకు మొక్కలను పలు ప్రాంతాల నుంచి రైతులు వచ్చి కొనుగోలు చేశారని అందుకే ఎక్కువ మంది రైతులు ఇప్పుడు నారు మడులు సాగు చేస్తున్నారని రైతులు తెలిపారు. జనవరి వరకు పలు విడతలుగా నారు అందుబాటులో ఉండేలా పెంపకం చేస్తున్నట్లు చెప్పారు. వైట్ బర్లీ పంట సాగు కూడా ఈఏడాది పెరుగుతుందని గత ఏడాది క్వింటా పొగాకు రూ.15వేల దర పలికిందన్నారు. వరి సాగు అయ్యే భూములలో కూడా రైతులు పొగాకు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని పలువురు తెలిపారు. మెత్తంమీద ఈ ఏడాది వైట్ బర్లీ పొగాకుపైనే రైతులు ఎంతో ఆశలతో ఉన్నారు.